teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 273 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 8 ఫిబ్రవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

ఇప్పట్లో లేనట్లేనని వెల్లడి.. తీసివేతలు, కూడికలపై అధిష్ఠానానిదే తుది నిర్ణయం



హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గంలో తీసివేతలు, కూడికలపై అధిష్ఠానానిదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం అక్కడ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించి పలు అంశాలపై మాట్లాడారు. ప్రతిపక్ష నేతల కేసుల విషయంలో చట్ట ప్రకారం ముందుకు వెళతామని అన్నారు. తనకు ఉన్న అవకాశం మేరకు అన్ని సమస్యలకు

మిగతా 2 లో



## సుర్రుమంటున్న సూరీడు

ఏప్రిల్, మేలో ఉష్ణోగ్రత రికార్డు స్థాయిలో ఉండనున్నట్లు సమాచారం

### తెలుగు రాష్ట్రాల్లో మండుతున్న ఎండలు

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండుతున్నాయి. చలి తీవ్రత తగ్గటంతో సురీడు సుర్రుమంటున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండటంతో ఉక్కపోత మొదలైంది. గతేడాది మార్చి నెలాఖరులో నమోదైన ఉష్ణోగ్రతలు ఇప్పుడు ఫిబ్రవరి మొదటి వారంలోనే రికార్డు అవ్వటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): ఇప్పుడే ఎండలు 37 డిగ్రీలు దాటితే ఏప్రిల్, మే నెలల్లో రికార్డు స్థాయిలో నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు. ఎండ తీవ్రతకు నిత్యం జనంతో రద్దీగా ఉండే రోడ్లన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి. ఇక గతేడాది అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ వేసవిలోనూ అదే తరహాలో ఉష్ణోగ్రతలు భారీగా రికార్డయ్యే

మిగతా 2 లో



## జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య రెస్పెక్ట్ ఘర్షణ

### గౌరవం ఇవ్వడం లేదంటూ గొడవకు దిగడంతో వివాదం




రెండు వర్గాలుగా విడిపోయి తన్నుకున్న విద్యార్థులు
అన్నం తినే ప్లేట్లతోనే ఒకరిపై ఒకరు దాడులు

హనుమకొండ కేయు, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. తమకు గౌరవం ఇవ్వడం లేదంటూ జూనియర్ విద్యార్థులతో సీనియర్లు గొడవకు దిగడంతో

మిగతా 2 లో

## కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులకు వెసులుబాటు

మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం
మార్పులు చేర్పులకు అవకాశం



02



02

## 8 బీజేపీ +8 కాంగ్రెస్ = 0 మోడల్ సక్సెస్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా
రాష్ట్రానికి రావాల్సిన వాటాలపై ట్విట్టర్ వేదికగా ట్వీట్
తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ ఎంపీలపై సంచలన ఆరోపణలు



## గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ల పట్ల హరీష్‌రావు ఆగ్రహం

మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప దాటదంటూ విమర్శలు

హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల పట్ల మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన

మిగతా 2 లో

## ప్రజల్లోకి బీసీ కులగణనపై పటిష్ట చర్యలు

### కులగణనపై కుల సంఘాల నేతలకు వివరిస్తాం

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): బీసీ కులగణన ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కులగణనపై కుల సంఘాల నేతలకు వివరిస్తామని చెప్పారు. శుక్రవారం మీడియా చానల్ తో మాట్లాడిన ఆయన సర్వే నివేదికపై ప్రజల్లో అపోహలు సృష్టించవద్దని

మిగతా 2 లో



## షోకాజ్ నోటీసు జారీపై తీన్మార్ మల్లన్న ఫైర్

బీసీ నినాదం వాళ్ల టార్గెట్ : మల్లన్న
బీసీలను అధికారం దాకా రానిస్తారా..?

.. వివరాలు 2లో



02

## ఆర్టీసీ జేఏసి సమ్మె నోటీసులపై స్పందించిన కార్మిక శాఖ

చర్చకు.. ఆర్టీసీ "జేఏసికి" యాజమాన్యానికి ఆహ్వానం



## ట్రంప్ చర్యలకు కేంద్రం మౌనం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

భారతీయులకు "అమెరికా" బేడీలతో పంపిస్తున్నా చలనంలేదా

హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): అమెరికాలో భారతీయులను అక్రమ వలసదారులుగా పేర్కొంటూ ట్రంప్ ప్రభుత్వం అమానవీయంగా, అవమానకరంగా కాళ్లకు, చేతులకు బేడీలు వేసి ఇండియా పంపిస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్

మిగతా 2 లో

## హిందూ బీసీలు.. ముస్లిం బీసీలు అని ఏ చట్టంలో ఉంది

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని ఏ చట్టంలో ఉందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

మిగతా 2 లో




ముగిసిన గ్రూప్-1 మెయిన్స్

## జవాబు పత్రాల మూల్యాంకనం

ఈ మేరకు వెల్లడించిన టిజీపిఎస్సీ
మెరిట్ జాబితా వెల్లడి తుది పరిశీలనలో టీజీపీఎస్సీ

హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): గ్రూప్-1 అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతంలో నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం

మిగతా 2 లో



## మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి పెట్టాలి

సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్

02

# చలి తీవ్రత తగ్గటంతో సుర్రుమంటున్న సూరీడు





మొదటి పేజీ తరువాయి

అవకాశం ఉందని వాతావరణశాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో పాటు ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం భారీగా పెరిగిపోతుంది. దీంతో తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా గురువారం ఒక్కరోజే అత్యధికంగా రికార్డు స్థాయిలో 15,752 మెగావాట్ల విద్యుత్ వినియోగం అయింది. దీంతో గత ఏడాది మార్చి 8న నమోదైన అత్యధికంగా 15,623 మెగావాట్ల డిమాండ్‌ను ఇది అధిగమించినట్లు విద్యుత్‌శాఖ ప్రకటించింది. వ్యవసాయానికి, పరిశ్రమలకు విద్యుత్ వినియోగం పెరగడంతో పాటు గృహ వినియోగం భారీగా పెరగంతోనే అత్యధికంగా విద్యుత్ డిమాండ్ నమోదు అయినట్లు తెలిపింది. ఇక ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 17,000ల మెగావాట్లకు చేరుకుంటుందని అంచనావేస్తుంది. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా బయటి ఆహారం జోలికి వెళ్లకపోవడమే ఉత్తమమని అంటున్నారు. శరీరంలో నీటిశాతం పెంచే తాజా పండ్లను అధికంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు పాటించాలంటున్నారు. మజ్జిగ, కొబ్బరి నీరు, రాగి జావ తాగిస్తే మంచిదంటున్నారు.

## 8 బీజేపీ + 8 కాంగ్రెస్ = 0 మోడల్ సక్సెస్



హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): 8 బీజేపీ ం 8 కాంగ్రెస్ = 0 మోడల్ సక్సెస్ అయ్యిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. బడ్జెట్ లో తెలంగాణకు రావాల్సిన వాటాలపై ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ తెలంగాణలోని కాంగ్రెస్, బీజేపీ ఎంపీలపై సంచలన ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా ఆమె 8 బీజేపీ ఎంపీలు ం 8 కాంగ్రెస్ ఎంపీలు = తెలంగాణకు రూ. 0 అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (పీఆర్ఎల్ఐపీ)కి జాతీయ హోదా నిరాకరించడం అంటే, తెలంగాణపై బీజేపీ ప్రభుత్వం చూపుతున్న మరో వివక్ష అని వ్యాఖ్యానించారు. అంతేగాక అన్యాయమైన బడ్జెట్ కేటాయింపులు, ప్రాజెక్ట్ గుర్తింపుల, మన సంస్కృతి, పండుగలను పూర్తిగా విస్మరించడం తెలంగాణ ఏర్పడినప్పటి నుండి నిరంతర నిర్లక్ష్యానికి గురవుతున్నామని అన్నారు. అలాగే పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు విస్మరించడం అనేది పురాతన చరిత్రలో సరికొత్త అధ్యాయంలా ఉందన్నారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాష్ట్రం నుంచి ప్రజలు ఎనిమిది మంది ఎంపీ లను ఇస్తే, ప్రతిఫలంగా పార్టీ ఏమీ ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఇక తెలంగాణకు బీజేపీ నిజమైన సహకారం సున్నా జవాబుదారీతనం, సున్నా గౌరవం మాత్రమేనని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణ వాటా కోసం పోరాడాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ప్రత్యేక హోదా కోసం మాజీ సీఎం కేసీఆర్ ఎడతెగని కృషి చేశారని తెలిపారు. అన్నింటికీ మించి తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, శ్రేయస్సుకు ప్రాధాన్యతనిస్తూ ఢిల్లీలో తెలంగాణ స్వరం బలంగా, స్పష్టంగా ప్రతిధ్వనించేలా కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడాలని సూచించారు. ఇక ఇది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల '8ం8 = 0 మోడల్'ల సమిష్టి వైఫల్యం అని కవిత విమర్శించారు.

## ప్రజల్లోకి బీసీ కులగణనపై పటిష్ట చర్యలు

మొదటి పేజీ తరువాయి



విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నేతలు సర్వేలో పాల్గొనలేదు. కానీ అవహేళన మాత్రం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు వెనుకబడిన వర్గాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సర్వేలో పాల్గొనని వారికి కులగణనపై మాట్లాడే అవకాశం లేదన్నారు. వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటామా అని ప్రశ్నించారు. కులగణన చేయబోమని కేంద్రంలో బీజేపీ అఫిడవిట్ ఇచ్చింది. కులగణనతో బీజేపీకి ఏం సంబంధం అని ప్రశ్నించారు. బీజేపి ఫ్యూడలిస్టిక్ పార్టీ అని ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన చేయాలనే డిమాండ్ ఉంది. కానీ ఇప్పటివరకు చేయలేదు. కానీ మా ప్రభుత్వం కులగణన ప్రక్రియను పక్కాగా పూర్తి చేసిందన్నారు. బీసీలకు 42 శాతం సీట్లు ఇచ్చేందుకు మా పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కులగణనను దేశం మొత్తం చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారని చెప్పారు.

## గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ల పట్ల హరీష్ రావు ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

గురుకులంలో ఫుడ్ పాయిజన్ కారణంగా విద్యార్థులు ఆసుపత్రి పాలుకావడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని విమర్శించారు. ఫుడ్ పాయిజన్ ఘటనపై శుక్రవారం ప్రెస్ నోట్ విడుదల చేసిన ఆయన కల్తీ ఆహారం విద్యార్థులకు పెడితే అరెస్టులు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గురుకులాల తీరు ఉందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి మీ మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప దాటదు అనేందుకు గురుకులాల దీన స్థితే నిదర్శనం అని ఎద్దేవా చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వందల మంది విద్యార్థులు ఆసుపత్రి పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఇకనైనా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, దామరవంచ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య "రెస్పెక్ట్" ఘర్షణ



మొదటి పేజీ తరువాయి

వివాదం మొదలైంది రెస్పెక్ట్ కావాలని గొడవలకు దిగారు. రెండు వర్గాలుగా విడిపోయి తన్నుకున్నారు. ఈ ఘటన వరంగల్ కాకతీయ యూనివర్సిటీ లో చోటుచేసుకుంది. వివరాలను పరిశీలిస్తే.. కాకతీయ యూనివర్సిటీలోని ఎమ్మెస్సీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు తమకు రెస్పెక్ట్ ఇవ్వట్లేదని సెకండ్ ఇయర్ విద్యార్థులు మధ్యాహ్న లంచ్ సమయంలో వారిని కాస్త గట్టిగా హెచ్చరించారు. దాంతో, ఈ గొడవ మొదలైంది. జూనియర్లు అంతా ఒక్కటై సీనియర్లపైకి గొడవకు వెళ్లారు. దాంతో, కాంటీన్ పరిసరాలు రణరంగాన్ని తలపించాయి. అన్నం తినే ప్లేట్లతోనే ఒకరిపై మరొకరు దాడులకు దిగారు. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీన యూనివర్సిటీకి చేరుకొని ఇరు వర్గాలను శాంతిపజేశారు. జరిగిన గొడవపై విచారణ చేపట్టి కొందరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## ట్రంప్ చర్యలకు కేంద్రం మౌనం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

మొదటి పేజీ తరువాయి

నేతలు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో ఫిరోజ్ ఖాన్ నేతృత్వంలో గాంధీ భవన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. చేతులకు బేడీలు వేసుకొని వినూత్న రీతిలో కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. భారత పౌరులకు బేడీలు వేసి అమెరికా నుంచి పంపిస్తున్న చలనం లేనట్లు కేంద్రం వ్యహరిస్తుందని, ప్రధాని మోడీ, బీజేపీ సిగ్గు పడాలని, అమెరికాకు గులాంగిరి బంద్ ఖరో అంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావ్, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కుమార్ రావు తదితరులు పాల్గొన్నారు.



## హిందూ బీసీలు.. ముస్లిం బీసీలు అని ఏ చట్టంలో ఉంది

మొదటి పేజీ తరువాయి



కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముస్లింలను బీసీల్లో ఎలా కలుపుతారని నిలదీశారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. దీనిపై రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అసలు కులగణన జరిపిన విధానమే సరిగా లేదని, 50 శాతం ఇళ్లకు సర్వే సిబ్బంది వెళ్లనేలేదని ఆరోపించారు. తెలంగాణలో కులగణన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు చర్య వల్ల బీసీల సంఖ్య తగ్గిందన్నారు. ఇది చాలా విచారకరం అని చెప్పారు. తూతూమంత్రంగా సర్వే చేశారని విమర్శించారు. ఈ సర్వేపై అనేక బీసీ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు.

**ఈ విధానం దేశంలో ఎక్కడా లేదు**

తెలంగాణలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ సర్కార్ ముస్లిం బీసీ, హిందూ బీసీలు అని కొత్త పాలసీ తెచ్చిందని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి విధానం దేశంలో మరెక్కడా లేదని స్పష్టంచేశారు. ప్రజలను కులం, మతం పేరుతో విభజించడం కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌గాంధీ కి అలవాటేనని దుయ్యబట్టారు. తమకు న్యాయం కావాలని ఓ వైపు బీసీలు కొట్లాడుతుంటే ముస్లింలను తీసుకొచ్చి బీసీల్లో కలపడం ద్వారా వారికి కాంగ్రెస్ పార్టీ మరింత అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఇది పూర్తిగా బీసీ వ్యతిరేక విధానం అని తేల్చి చెప్పారు.

## ముగిసిన గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనం

మొదటి పేజీ తరువాయి

తెలిసిందే. ఈ క్రమంలో టిజీపిఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు గత ఏడాది అక్టోబర్ 21 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తం 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ క్రమంలో ప్రిలిమ్స్‌లో 31,383 మంది క్వాలిఫై కాగా వారిలో కేవలం 67.17శాతం మాత్రమే పరీక్ష రాశారు. దీని ప్రకారం ఒక్కో పోస్టుకు దాదాపు 38 మంది పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో తాజాగా జవాబు పత్రాల మూల్యాంకన పై టీజీపీఎస్సీ కీలక ప్రకటన చేసింది. గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసినట్లు వెల్లడించింది. ఈ మెయిన్స్ పరీక్షలో అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితా వెల్లడించేందుకు టీజీపీఎస్సీ తుది పరిశీలన చేస్తుంది. ఇది ముగిసిన వెంటనే వారం, పది రోజుల్లో ఫలితాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయని తెలిపింది.

మెరిట్ జాబితా లోని అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేసి, తుది ఎంపిక జాబితా విడుదల చేస్తారు. ఇక గ్రూప్- 2,3 పరీక్ష ఫలితాల కోసం అభ్యర్థులు ఎదురు చూస్తోన్న నేపథ్యంలో గ్రూప్-1 పోస్టుల నియామకాలు పూర్తయ్యాకే గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల ఫలితాలు వెల్లడించాలని టీజీపీఎస్సీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

శాశ్వత పరిష్కారం దిశగా పనిచేస్తున్నానని చెప్పారు. కులగణన ఆశామాషీగా చేసింది కాదు ఎంతో పకడ్బందీగా చేశామన్నారు. పీసీసీ కార్యవర్గ కూర్పు కొలిక్కి వచ్చిందని, ఈ విషయంలో రెండు రోజుల్లో ప్రకటన ఉంటుందన్నారు. నాకు రాహుల్‌గాంధీకి మధ్య గ్యాప్ లేదని, మా ఇద్దరి మధ్య సాన్నిహిత్యం ఉందన్నారు. రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోరలేదన్నారు.

**ఖర్గేతో ముఖ్యమంత్రి భేటీ**

అంతకు ముందు పార్లమెంట్‌లో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ను రేవంత్ రెడ్డి కలిశారు. కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం, పార్టీ పని తీరు, తాజా రాజకీయ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఖర్గేకు వివరించినట్లు సమాచారం. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఉన్నారు. అనంతరం పీసీసీ మాజీ అధ్యక్షుడు మల్లు అనంతరాములు వర్ధంతిని పురస్కరించుకుని రేవంత్ ఢిల్లీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా రెండు సార్లు ఎన్నికైన మల్లు అనంతరాములు ఆ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు.



**టీ కాంగ్రెస్ నేతలతో కేసీ వేణుగోపాల్ చర్చలు**

తెలంగాణ ముఖ్యనేతలతో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ విడివిడిగా చర్చలు జరిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీతో చర్చించారు. పీసీసీ కార్యవర్గం కూర్పు, మంత్రివర్గ విస్తరణపై నేతల అభిప్రాయాలను సేకరించారు.

**పీసీసీ కార్యవర్గానికి గ్రీన్‌సిగ్నల్**

పీసీసీ కార్యవర్గం ప్రకటించేందుకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా పీసీసీ కార్యవర్గం ప్రకటించనుండగా అందులో సామాజిక సమీకరణాలు బేరీజు వేసుకుని ఒక మాదిగ, ఒక ముస్లిం, ఒక లంబాడా, ఒక రెడ్డి వర్గాలతో నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులు ఉండనున్నట్లు తెలుస్తోంది. 15 - 20 మంది వరకు ఉపాధ్యక్షులు ఉండే అవకాశం కనిపిస్తోంది. అలాగే పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులపై కూడా ఈ చర్చల్లో కసరత్తు చేసినట్లు తెలిసింది.

## కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులకు వెసులుబాటు



హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులకు అప్లై చేయాలనుకునే వారికి ఓ వెసులుబాటు కల్పించింది. ఇకపై కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి అనుకునే వారు మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. అదే విధంగా రేషన్ కార్డుల్లో ఏవైనా మార్పులు చేర్పులు చేసుకోవాలి అనుకునే వారికి కూడా ఆ అవకాశాన్ని కల్పిస్తోంది ప్రభుత్వం. ఇందుకోసం స్థానికంగా ఉండే మీసేవా సెంటర్లలో సంబంధిత పత్రాలు జత చేయాలని సూచించింది. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆరు పథకాల అమలుకు రేషన్ కార్డులను ముఖ్య ఆధారిత ధ్రువపత్రంగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే గత ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులను స్వీకరించలేదు. దాదాపు నాలుగేళ్ల నుంచి అనేక వేల మంది కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు సమర్పించడానికే కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూశారు. 2023 ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీల అమలుకు తెల్ల రేషన్ కార్డులు ఉన్నవారు మాత్రమే అర్హులుగా తెలిపింది. అయితే కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు నేరుగా మండల కార్యాలయాల్లో సమర్పించాలని తెలియ జేసింది. అయితే ఈ పరిశీలన అంతా పూర్తయ్యి గత 2025 జనవరిలో కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం మొదలు పెట్టింది ప్రభుత్వం. అయినప్పటికీ ఇంకా ఎవరైనా దరఖాస్తు చేయని వారికి మరో అవకాశం కల్పిస్తూ మీసేవా కేంద్రాల ద్వారా కూడా అప్లై చేసుకునే వెసులుబాటు కల్పించింది.

## ఆర్టీసీ జేఏసి సమ్మె నోటీసులపై స్పందించిన కార్మిక శాఖ



హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఆర్టీసీ జేఏసి ఇచ్చిన సమ్మె నోటీసులపై కార్మిక శాఖ స్పందించింది. జనవరి 27న టిజీ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ సమ్మె నోటీసులపై కార్మిక శాఖ స్పందిస్తూ అటు ఆర్టీసీ జేఏసికి, ఇటు ఆర్టీసీ యాజమాన్యాన్ని చర్చలకు రావాల్సిందిగా ఆహ్వానించింది. ఈ నెల 10న సోమవారం నాడు చర్చలు జరపనున్నట్లు కార్మిక శాఖ వెల్లడించింది. ఆర్టీసీ యాజమాన్యం నుండి ఆర్టీసీ ఉద్యోగ జేఏసీ కోరుతున్న 21 డిమాండ్స్ పై కార్మిక శాఖ చర్చించనుంది. ఆర్టీసీ ఉద్యోగ జేఏసి ఇచ్చిన గడువు ఫిబ్రవరి 9వ తేదీతో ముగియనుంది. ఆ లోగా ఆర్టీసీ యాజమాన్యం స్పందించకపోతే ఆ తరువాత తాము సమ్మెకు దిగుతామని ఆర్టీసీ జేఏసీ హెచ్చరిస్తూ వస్తోంది. ఈ కారణంగానే ఫిబ్రవరి 10న వారి సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు కార్మిక శాఖ ముందుకొచ్చినట్లు తెలుస్తోంది. ఆర్టీసీలో రిటైర్మెంట్ అవుతున్న వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవడం లేదని ఆర్టీసీ జేఏసి చెబుతోంది. పాత వారి స్థానంలో కొత్త వారిని తీసుకోకపోవడం వల్ల ఉన్న కొద్దిమంది సిబ్బందిపైనే అధిక పనిభారం పడుతోందంటున్నారు. ఎక్కువ పని గంటలు పనిచేయడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆర్టీసి సిబ్బంది వాపోతున్నారు. ఒకవైపు ఆర్టీసీ యాజమాన్యం కొత్త బస్సులు కొనడం లేదని, మరోవైపు కొనే కొన్ని బస్సులు కూడా ప్రైవేట్ బస్సుల కిందే తీసుకుంటూ ఆర్టీసీనీ ప్రైవేటీకరణ చేసేందుకు యత్నిస్తున్నారని ఆర్టీసీ జేఏసి ఆరోపిస్తోంది. ఇలాంటి సమస్యలే కాకుండా ఇప్పటికే పెండింగ్ లో ఉన్న ఫిట్మెంట్, డిఏ సమస్యలు ఇంకెన్నో ఉన్నాయని ఆర్టీసీ ఉద్యోగులు చెబుతున్నారు.

## షోకాజ్ నోటీసు జారీపై తీన్మార్ మల్లన్న ఫైర్



హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక -ఆర్థిక కుల సర్వే కాపీలను తగలబెట్టి, పార్టీ నాయకత్వంపై అభ్యంతరకరమైన వ్యాఖ్య లు చేసినందుకు తెలంగాణ కాంగ్రెస్ గురువారం ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. మే 12 లోపు తన సమాధానం ఇవ్వాలని పార్టీ ఎమ్మెల్సీని ఆదేశించింది. ఫిబ్రవరి 12న లేదా అంతకు ముందు మీ వివరణను తెలియజేయాలి, లేకుంటే కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ నిబంధనల ప్రకారం బలమైన చర్యలు తీసుకుంటారు అని నోటీసులో పేర్కొన్నారు. షోకాజ్ నోటీసు జారీపై తీన్మార్ మల్లన్న మీడియాతో మాట్లాడుతూ ఫైర్ అయ్యారు. కుల గణనలో ఉన్న వాళ్లకే షోకాజ్ నోటీసు జారీ చేయాలన్నారు. చింతపండు నవీన్ వాస్తవానికి తీన్మార్ మల్లన్న వాళ్ల లక్ష్యం కాదన్నారు. మల్లన్న సృష్టిస్తున్న బీసీ నినాదం వాళ్ల టార్గెట్ అని పేర్కొన్నారు. బీసీలను తగ్గించడం వాళ్ల ఉద్దేశ్యం అయినప్పుడు బీసీలను అధికారం దాకా రాణిస్తారా అని ఆయన ప్రశ్నించారు. బీసీలను అణిచి వేసి, వాళ్ల గొంతు లేవద్దనే ఉద్దేశంతో ఉన్నట్లు తెలిపారు. కానీ అవేవి కుదరవు, ఆ పప్పులేవి ఉడకవన్నారు.

**రాహుల్ గాంధీ బీసీలు మేలుకో అని చెప్పిండు**

తమ నాయకుడు రాహుల్ గాంధీ బీసీలు మేలుకో అని చెప్పిండని తెలిపారు. ఆ పదం ఆదారంగా ఆయన పార్లమెంట్‌లో చెప్పినటువంటి మాటల ఆదర్శంగా నేడు తెలంగాణ రాష్ట్రంలో అన్ని బీసీ కులాలు ఒక్కటి అయి, తమ వాటా ఏదని ప్రశ్నిస్తున్న తరుణంలో బీసీల మీద దెబ్బకొంటే విధంగా ఈ నివేదిక తీసుకువచ్చినట్లు ఆయన దుయ్యబట్టారు. బీసీ ప్రజల కంటే ఈ షోకాజ్ నోటీసు పెద్దది కాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీసీలను దూరం చేస్తున్నటువంటి దొంగలు, ద్రోహులు ఎవరైతే ఉన్నారో వాళ్లకు వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలన్నారు. ఇది బీసీల ఉద్యమాన్ని అణచడానికి, వారి హక్కుల కోసం పోరాడితే ఇచ్చిన నోటీసు. అందుకే బీసీ సమాజం నన్ను రిప్లయి ఇవ్వమంటే నేను ఇస్తా. కాని తీన్మార్ మల్లన్న అనే వ్యక్తి ఎవరి ముందు మోకరిల్లడు. ఇది ఫైనల్ అని పేర్కొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి పెట్టాలి



హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. మీ ఢిల్లీ బాసులు, మీ గల్లీ దోస్తులు ఆకలి తీర్చడం కాదు, ముందు మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి పెట్టాలని సూచించారు. శుక్రవారం ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ చేసిన కేటీఆర్, పేదల గూళ్లపై బుల్డోజర్లు పంపడంలో ఉన్న ప్రేమ, ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు తిండి పెట్టడంలో లేదా? అని ప్రశ్నించారు. అమృత్ స్కీమ్‌ను బామ్మర్దికి అప్పగించే తెలివి ఉందని, కానీ ఆకలితో అలమటిస్తున్న చిన్నారుల కోసం ఆలోచన లేదా? అని నిలదీశారు. మూసీ ప్రక్షాళన పేరుతో నిధులు ఢిల్లీకి తరలించడంలో ఉన్న శ్రద్ధ, పాఠశాలల మూలభూత అవసరాలపై లేదా? అని ప్రశ్నించారు. మంత్రుల సంగతి పక్కన పెడితే, సీఎం స్వయంగా ఉన్న నియోజకవర్గంలోనే పిల్లలు ఆకలితో ఉన్నారని ఆరోపించారు. ఒక్కరోజు ఫోటోలకు ఫోజులివ్వడం కాక, ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం అందుతున్నదా లేదా అన్నది సమీక్షించాలని సూచించారు. ప్రజలను ఆదుకోవాల్సిన పాలన కష్టాల్లోకి నెట్టే విధంగా మారిందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

# బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అప్పులపాలు

**కాంగ్రెస్ పాలనతోనే అర్హులందరికీ సంక్షేమ ఫలాలు**

**కాంగ్రెస్ పాలనలో 55 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు**

**మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ప్రభుత్వంపై వాక్యాలు సరికావు**

**ఆర్థిక సామాజిక సర్వేను**

**ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తుంది**

**ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేస్తున్నాం**

**ప్రజా పాలనకు రేవంత్ సర్కార్ పెద్దపీట**

**రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**




సూర్యాపేట, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): లక్షల కోట్ల రూపాయలు అప్పు తెచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు, బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ

ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా నాశనం చేశారని ఆరోపించారు. కెసిఆర్ అసమర్థ పాలన వలన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత సంవత్సరం కాలంలో అనేక హామీలను అమలు చేసిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలు చేసి ప్రజా రంజకంగా ప్రజా పాలన నడుస్తుందన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో 55 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని వివరించారు.కులగణను, ఆర్థిక సామాజిక సర్వేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించిందని కొనియాడారు. బిసిల జనాభాను, వారి ఆర్థిక స్థితిగతులను సర్వే చేయడం ద్వారా వారికి రాజ్యాంగ ఫలాలు అందడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ముందడుగు వేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిసిల కులగణన, ఆర్థిక సర్వేను చేపట్టి, సంక్షేమ ఫలాలు, అభివృద్ధి అట్టడుగు వర్గాల ప్రజలకు చేరే విధంగా పనిచేస్తుందని వెల్లడించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగు పథకాలను ప్రారంభించిందని ఆయన అన్నారు. నూతనంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలు ప్రారంభించారని వివరించారు. ఎకరం పొలం వున్న రైతులకు రైతు భరోసా డబ్బులు వారి బ్యాంకు ఖాతాలలో జమ అయినాయని చెప్పారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జగదీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కి పాలన చేతకాదని విమర్శలు చేయడాన్ని రమేష్ రెడ్డి తప్పుపట్టారు. బీ ఆర్ఎస్ వారి పాలనలో నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ ఫాం హౌస్ కే పరిమితం అయినారని ధ్వజమెత్తారు. ఏనాడు సచివాలయానికి నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ వచ్చిన దాఖలాలు లేవని అన్నారు. కెసిఆర్ ఏనాడు అధికారులతో గాని మంత్రులతో గాని సమీక్ష చేయలేదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ కి 135 ఏళ్ల చరిత్ర వుందని, జగదీష్ రెడ్డి తండ్రి కి, తాతకు కాంగ్రెస్ పాలన తెలుసని అన్నారు. దేశంలో సంస్కరణలు తీసుకుని వచ్చింది ఇందిరాగాంధీ అని, శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అని, దేశం కోసం ప్రాణాలర్పించిన చరిత్ర కాంగ్రెస్ నాయకులని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షఫీ ఉల్లా, ముదిరెడ్డి రమణారెడ్డి, వెలుగు వెంకన్న, వల్దాస్ దేవేందర్, పిల్లల రమేష్ నాయుడు, నరేడ్ల సోమయ్య, ఉపేందర్, కరుణాకర్ రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల పనితీరు మెరుగుపడాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**




వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరు మెరుగుపడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల నిర్వహణపై మండల ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపాళ్లతో కలెక్టరేట్లో బుధవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఇటీవల తాను (కలెక్టర్) స్వయంగా తనిఖీ చేసిన వసతి గృహాలు, జిల్లా ఉన్నతాధికారులు, మండల ప్రత్యేకాధికారులు హాస్టళ్లను తనిఖీ చేసిన సమయంలో గమనించిన లోటుపాట్లను ప్రస్తావిస్తూ వాటిని చక్కదిద్దుకోవాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. హాస్టళ్ల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల పట్ల తమ స్వంత పిల్లల్లా శ్రద్ధ వహిస్తూ, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యాబోధన, సరైన వసతి సదుపాయాలను కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆదివారం మెనులో విద్యార్థులకు అందించే భోజనం ఫోటోలు గూగుల్ షీట్ లో పంపాలని ఆదేశించారు. ఆకస్మిక తనిఖీ చేపటడతామని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఆర్డీఓ కౌసల్యాదేవి, డీఈఓ జ్ఞానేశ్వర్, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, సంక్షేమ వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా శుక్రవారం ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపర్డెంట్లు రంగ ప్రసాద్, ధారా ప్రసాద్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలలో పొరపాట్లకు జరగకుండా నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ మరియు జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి**



ములుగు జిల్లా, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): వరంగల్- ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని

ములుగు జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ మరియు జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి సి హెచ్ మహేందర్ జి కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్- ఖమ్మం -నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన పిఓ, ఏపిఓల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం జారీ చేసిన పిఓ హ్యాండ్ బుక్ ను బాగా చదవాలని చెప్పారు. పిఓ, ఏపీవో వారికి కేటాయించిన విధుల ప్రకారం పోలింగ్ నిర్వహించాలన్నారు. పీవో పోలింగ్ కేంద్రంలో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రదర్శింప చేయడం, అభ్యర్థుల ఏజెంట్ల జాబితా పరిశీలన, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం వంటి అన్ని అంశాల పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అంతేకాక బ్యాలెట్ బాక్సులు ముందే తనిఖీ చేసుకోవాలని, పోలింగ్ కు ముందే ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ లు తెరిచి చూపించాలని, అప్పుడే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వారికి తెలుస్తుందని అన్నారు. డిక్లరేషన్ అలాగే పోల్ ప్రారంభం వంటి వాటి పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రం పరిధిలో శాంతిభద్రతలు, అలాగే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించబడే వారి వివరాలు అన్నింటి పట్ల పిఓ, ఏపిఓ లు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రాధాన్యత క్రమంలో ఓటర్లు ఓటు వేయవలసి ఉంటుందని, ఇందుకు ఎన్నికల కమిషన్ అంగీకరించిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్ మాత్రమే వాడాలని ఈ విషయం ముందే ఓటర్లకు తెలియజేయాలని చెప్పారు. ఎన్నికలలో ఫారం -16 అత్యంత కీలకమని అన్నారు. బ్యాలెట్ పేపర్ కు సంబంధించి ఎలాంటి పొరపాట్లు లేకుండా తీసుకున్న బ్యాలెట్లు, ఓటింగ్ తర్వాత అప్పజెప్పే బ్యాలెట్ పేపర్ల విషయంలో తేడాలు లేకుండా చూసుకోవాలని, వినియోగించిన బ్యాలెట్లను సైతం సీరియల్ నంబర్ తో సహా వేసుకొని సమర్పించాలన్నారు. ఎన్నికలలో

పిఓ డైరీ అత్యంత కీలకమని ఆయన తెలిపారు. అలాగే స్టాట్యూరీ నాన్ స్టాట్యూరీ కవర్లు వీటన్నిటి పట్ల అవగాహన కలిగి ఉండాలని, మరోసారి ఎన్నికలకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఎట్టి పరిస్థితులలో ఎన్నికల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించవద్దని పూర్తి జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ (ఏఆర్ఓ) వెంకటేష్, ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, సూపరిండెంట్ శివ కుమార్, ఎన్నికల శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు

**కళాకారులతో కలిసి త్యాగరాజ కీర్తనను ఆలపించిన కలెక్టర్ ప్రావిణ్య**

హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): హనుమకొండ బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రం ఆడిటోరియంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని సంగీత, నృత్య కార్యక్రమాల్ని నిర్వహించారు. త్యాగరాజ ఆరాధన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ముఖ్య అతిథిగా పాల్గొని హైదరాబాద్ నుండి వచ్చిన కళాకారులతో పాటు స్థానిక కళాకారులు, కళాశాల అధ్యాపక బృందంతో కలిసి త్యాగరాజ కీర్తనను ఆలపించారు. అదేవిధంగా హైదరాబాద్ కు చెందిన పలువురు కళాకారులతో పాటు స్థానిక కళాకారులు పలు త్యాగరాజ కీర్తనలు ఆలపించగా కలెక్టర్ తిలకించారు. స్థానిక కళాకారులతో పాటు హైదరాబాద్ కు చెందిన కళాకారులు త్యాగరాజ కీర్తనలను ఆలపించి సంగీత అభిమానులను అలరింపజేశారు.



విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ వేడుకలలో పాల్గొన్న కళాకారులందరికీ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అభినందనలు తెలియజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కళాకారులందరికీ స్వర్ణోత్సవ శుభాకాంక్షలను కలెక్టర్ తెలియజేశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపల్ నాడ్గాడ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో కళాశాల అధ్యాపకులు భాస్కర్, అనుముల యోష , హైదరాబాద్ లోని తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓని విజయ్, తదితరులతోపాటు కళాకారులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

# ఆశ్రమ గురుకుల వసతి గృహాలలో మెరుగైన సౌకర్యాలు అందించాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): ఆశ్రమ గురుకుల పాఠశాలలు మరియు వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే సౌకర్యాలు మెరుగుపరచాలని అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. శుక్రవారం పాల్వంచ ఆశ్రమ గురుకుల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డైనింగ్ హాల్, తరగతి గదులు, పరిసరాలు, మరుగుదొడ్లు, వంటగది పరిశీలించారు. పరిశీలనలో భాగంగా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారికి అందుతున్న ఆహారం మెనూ ప్రకారం అందిస్తున్నారా మరియు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డార్మెటరీ డోర్లు మరియు కిటికీలు, త్రాగునీటి సమస్యలు, ఎలక్ట్రికల్ సమస్యలు పరిష్కరించడానికి తగిన ప్రణాళికల అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. డార్మెటరీ హాల్లో దోమలు రాకుండా జాలి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రహరీ గోడ పై కంచ ఏర్పాటు చేయాలని దానికి అవసరమైన నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, నాణ్యత లేని పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆదేశించారు. పాఠశాలలు మరియు వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని అన్నారు.నాణ్యమైన విద్య, మెనూ సక్రమంగా అందించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం అందరి బాధ్యత అని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అవరోదించగలుగుతారని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ పర్యనల్ లో కలెక్టర్ వెంట డిడి ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, పాఠశాల హెడ్మాస్టర్ బద్రు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కేజీబీవీ పాఠశాలను శుక్రవారం, అడిషనల్ కలెక్టర్ వెంట ఆర్డిఓ గణేష్ ఎమ్మార్వో శ్రీనివాస్. మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్య అందించుటకు కృషి చేస్తుందని కావున ఉపాధ్యాయులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం కేజీబీవీ పరిసర ప్రాంతాలను కలియ తిరుగుతూ డైనింగ్ హాల్ నీట్ గా ఉండడం చూసి ఉపాధ్యాయులను అభినందించారు. ఆహార నియమాలు పిల్లలకు ఇస్తున్న మెనూ పరిశీలించి పిల్లలకిస్తున్న ఆహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. భోజన రుచికరంగా ఉంటుందా అని పిల్లల్ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్టాక్ ఎంత ఉంది పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. టాయిలెట్స్ ని క్షుణ్ణంగా పరిశీలించారు. మున్సిపల్ వాహనం వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్టాస్వామి కేజీబీవీ ప్రిన్సిపల్ శైలజ.హెల్త్ అసిస్టెంట్ రాజు. శానిటరీ ఇన్స్పెక్టర్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా అవసరం

**టీఎస్ జేయు ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఉచిత**

**ప్రమాద బీమా పత్రాలు అందజేత**

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద**



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): టీ.ఎస్.జే.యు రాష్ట్ర అధ్యక్షుడు నారగోని పురుషోత్తం గౌడ్ ఆధ్వర్యంలో వరంగల్ టీఎస్ జేయు యూనియన్ సభ్యులందరికీ ఐదు లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని అందజేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో దీనికి సంబంధించిన బీమా పత్రాలను జిల్లా కలెక్టర్ సత్య శారదా చేతుల మీదుగా సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతుంటారు. ఆ సమయంలో వీరికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు. టీఎస్ జెయు ఆధ్వర్యంలో జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా కల్పించడం నిజంగా అభినందించదగ్గ విషయం అని అన్నారు. కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం గౌడ్ నారగోని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి రావుల నరేష్, జిల్లా అధ్యక్షులు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి, ఉపాధ్యక్షులు లింగబత్తిని కృష్ణ, కందికొండ గంగరాజు, ఈద శ్రీనాథ్, బత్తుల సత్యం, వల్లెపు భాగ్యరాజ్ సభ్యులు కౌడగాని మోహన్ రావు, నీరుటి శ్రీహరి, అడుప అశోక్, మంతెన సురేష్, అవినాష్, బొక్క రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు రైతులు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పై రైతుల ఎలాంటి అపోహలు చెందవద్దని, మెరుగైన పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి గ్రీన్ ఫిల్డ్ ఎక్స్ప్రెస్ హైవే ఏర్పాట్లు

భూ సేకరణకై గీసుగొండ మండలం ఉకల్, మచ్చాపూర్, గ్రామాలకు చెందిన రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేశాభివృద్ధికి రహదారులు చాలా అవసరమని, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు రైతులు తమ భూములను అందించి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసిల్దార్ రియాజుద్దీన్, జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య, టీం లీడర్ సంపత్ కుమార్, పర్యవేక్షకులు శ్రీకాంత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కుట్ర పూరితంగా బీసీల జనాభా తగ్గించి బీసీ సమాజానికి తీవ్ర అన్యాయం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

### బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండ్ల రామకృష్ణ



ఆత్మకూర్ ఫిబ్రవరి 07 తీన్మార్ న్యూస్:- కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల ద్రోహి 2023 నవంబర్ 10 వ తేదీన కామారెడ్డి లో జరిగిన బీసీ డిక్లరేషన్ లో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి మరియు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తో బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీ లకు ధోకా చేసిండు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 6 నెలలలోపు బీసీ కులగణన చేసి స్థానిక ఎన్నికలలో 23 శాతం నుంచి 42 శాతానికి రిజర్వేషన్ లను పెంచి చట్టబద్ధత కల్పిస్తాం అని మాయమాటలు చెప్పి తెలంగాణ బీసీ లతో ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చినాక బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని తెలంగాణాలో బొందపెడుతాం అని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మండ్ల రామకృష్ణ ఆత్మకూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ధ్వజమెత్తారు.గతంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ 2014 లో జరిపిన సమగ్ర కుటుంబ సర్వేను 24 గంటలలోనే సర్వే చేయించి బీసీల జనాభా తెలంగాణాలో 51 శాతం అని తేల్చిన గొప్పనాయకుడు కెసిఆర్ అనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో ఏర్పాటుచేసిన జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ సైతం తెలంగాణ రాష్ట్రంలో బీసీలు,ఎస్సీలు,ఎస్టీలు కలిపి 93% ఉన్నారని వారు రిపోర్ట్ ఇచ్చారని ఆయన అన్నారు.అదేవిధంగా 2011లో నేషనల్ శాంపుల్ సర్వే గాని మరియు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2014 లో కెసిఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిపిన ఎస్ కే ఎస్ సర్వే ద్వారా తెలంగాణలో ఎస్సీ ఎస్టీ బీసీలు 93 శాతం ఉన్నారని అందులో బీసీలే 51% పైగా ఉన్నారని సర్వేలో తేలిందని ఇది చాలా దురదృష్టం అన్నారు.2014 లో జరిగిన సర్వేలో బీసీలు 51 శాతం ఉంటె 2025. లో జనాభా పెరగాలి గాని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అశాస్త్రీయంగా సర్వే జరపడం వలన బీసి ల జనాభా 46 శాతానికి పడిపోవడం చూస్తే బీసీ లను ఎలా మోసం చేస్తుందో అర్థం అవుతుంది అని మండ్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానం ప్రకారం బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇస్తామని ఇప్పుడు కోర్టు జడ్జిమెంట్లను కోడ్ చేస్తూ పార్టీ పరంగా ఇస్తామని మాట మార్చడం అత్యంత దుర్మార్గం అని ఆయన అన్నారు అబద్ధాలకు ప్రతి రూపమే కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు.హైకోర్టు ఆదేశాలతో బుసాని వెంకటేశ్వరావు నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు అయినప్పటినుంచి మా బారాస పార్టీగా మొదటి నుంచి చెబుతున్నామని సర్వే క్షేత్రస్థాయిలో సమగ్రంగా జరపాలని లేని పక్షంలో కరెక్ట్ రిజల్ట్స్ ఉండదని మేము ప్రభుత్వం దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా ఈ ప్రభుత్వం వినకుండా ప్లానింగ్ కమిషన్ ద్వారా ఎన్యుమరేటర్స్ కి సరైన శిక్షణ లేకుండా మధ్యాహ్నం తర్వాత ఊర్లలో ప్రజలు ఇళ్ల దగ్గర లేనప్పుడు సర్వే చేశారని అదేవిధంగా పట్టణ ప్రాంతాలలో కూడా సమగ్ర సర్వే సక్రమంగా జరగలేదని ఈయొక్క సర్వేలో అనేక రకాల ప్రశ్నలు ఆర్థికపరమైన అంశాలు ఆధార్ కార్డు,పాన్ కార్డు ఇలా అనేక వ్యక్తిగత విషయాలు అడగడం ద్వారా ప్రజలు అందులో పాల్గొనలేదని అన్నారు.ఇప్పటికైనా ఈ ప్రభుత్వం జరిగిన తప్పిదాలను గమనించి మరొకసారి కొన్నిరోజులు ఈ సర్వేని ఎక్స్టెన్షన్ చేసి ప్రత్యేక సర్వే జరిపించాలని డిమాండ్ చేశారు.ఏది ఏమైనా ఎలక్షన్ లో వాగ్దానం చేసిన విధంగా చట్టపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలనీ లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీసీ సమాజం తగిన గుణపాఠం చెప్పటానికి సిద్ధంగా ఉన్నదని ఈ సందర్భంగ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మండ్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

### ఉపాధి హామీ లక్ష్యాలను పూర్తిచేయాలి

### ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వహించరాదు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఉపాధి హామీ పనులు, నర్సరీలపై ఏపీఓలు, సీఓలు, ఈసీ లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను నాణ్యతతో చేయించాలని, ఈ నెల 15లోగా ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని దినాలతో ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన పని రోజుల లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. నర్సరీలలో విత్తనాలు నాటాలని, వాటికి నిత్యం నీటిని అందిస్తూ మొక్కలను పెంచాలని, రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటాలని, వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో పెండింగ్ లో ఉన్న బోరు బావులు, కాక్ పిట్స్, మురుగు కాలువల వ్యవస్థ, తదితరాలపై ఉపాధి హామీ పనులను వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్డీఏ వసంత, అడిషనల్ డీఆర్డీఏ చంద్రశేఖర్, టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దుల్లో పాక్ చొరబాట్లు భగ్నం

### ఏడుగురిని హతమార్చిన భద్రతా బలగాలు

**శ్రీనగర్, ఫిబ్రవరి 7 (తీన్మార్ న్యూస్) :** భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించాలన్న పాక్ ఉగ్రవాదుల కుట్రలను భద్రతా బలగాలు భగ్నం చేశాయి. నియంత్రణ రేఖను దాటేందుకు యత్నిస్తుండగా ఏడుగురు చొరబాటుదారులను హతమార్చాయి. మృతుల్లో పాకిస్థాన్ ఆర్మీ సిబ్బంది కూడా ఉన్నట్లు తెలుస్తోంది. జమ్మూ కశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో గల కృష్ణ ఘాటి సెక్టార్‌లో ఫిబ్రవరి 4- 5 మధ్యరాత్రి వేళ ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. నియంత్రణ రేఖను దాటి భారత ఫార్వర్డ్ పోస్ట్‌పై దాడికి యత్నిస్తున్న పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్‌పై సైన్యం మెరుపుదాడికి పాల్పడింది. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో ఏడుగురు చొరబాటుదారులు హతమైనట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. మృతుల్లో 2-3 పాకిస్థానీ ఆర్మీ రెగ్యులర్స్ ఉన్నట్లు పేర్కొన్నాయి. మిగతా వారు ఉగ్రవాదులని, వారు అల్-బదర్ గ్రూప్‌నకు చెందిన వారై ఉంటారని సదరు వర్గాలు తెలిపాయి. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ శాంతి మంత్రం వల్లెవేసిన కొద్ది రోజులకే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. కశ్మీర్ సహా అన్ని సమస్యలన్నింటినీ భారత్‌తో సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నట్లు ఇటీవల ఆయన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.

# వ్యవసాయరంగం బలోపేతంతోనే ఆర్థికాభివృద్ధి

### దిగుమతులను తగ్గించి..స్వయం సమృద్ధి సాధించాలి

### వ్యవసాయాధారిత పరిశ్రమలకు ఊతమివ్వాలి



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 7(తీన్మార్ న్యూస్) :** వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయలేనంత కాలం దేశం ఆర్థికంగా పురోగమించదని నిపుణులు పదేపదే సూచిస్తున్నా..అందుకు అనుగుణంగా అడుగులు వేయడం లేదు. దేశంలో సమజవనరులు ఉన్నా, ఇంకా దిగుబడులపై ఆధారపడుతున్నాం. వంటనూనెలు, పప్పుల దిగుమతులపై పునరాలోచన చేయాలి. సొంతంగా ఆహారధాన్యాలను ఉత్పతత్ఇ చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలి. కార్పోరేట్లకు ఇస్తున్న రాయితీలను రైతులకు కూడా వర్తింపచేసి పంటలను పండించుకునే దిశగా అడుగులు వేయాలి. దేశ జనాభాకు అనుగుణంగా అవసరమైన పంటలను ప్రోత్సహించాలి. వ్యవసాయ దిగుబడులను తగ్గించి, ఎగుమతులను పెంచుకోవాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలన్న సూచనలు పెడచెవిన పెడుతున్నారు. నదుల అనుసంధానం జరగడం లేదు. అధికారంలోకి వచ్చిన కొత్తలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని రెండింత లు చేస్తానన్న మోడీ హామి పదేళ్లయినా అమలు కావడం లేదు. దేశ జనాభాలో 60 శాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా ఈ రంగాన్ని పైకి తీసుకుని రావడం, వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం జరగడం లేదు. పప్పుల ధరలు పెరుగుతున్నా, మనదేశంలో పప్పు పంటలను ప్రోత్సహించడం లేదు. నూనె ధరలు పెరుగుతున్నా, నూనెగింజల పంటలకు ప్రోత్సాహం దక్కడం లేదు. 2018-19 నాడు 7.8 శాతం అభివృద్ధితో వున్న వ్యవసాయరంగం 2024 మార్చి నాటికి 0.6 శాతానికి పడిపోయింది. వేగంగా దిగజారిపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవలసి వుంది. కానీ అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. రానున్న రోజుల్లో ఎరువులు, పురుగు మందుల ధరలు మరింతగా పెరుగుతాయి. పంటల పెట్టుబడి సహాయం పెంచకుండా, కనీస మద్దతు ధర, ఉచిత బీమా అమలు చేయకుండా వ్యవసాయ సంక్షోభాన్ని బిజెపి ప్రభుత్వం మరింత తీవ్రం చేస్తున్నది. ఆహార సబ్సిడీ తగ్గించడంతో పేదలకు అందుతున్న రేషన్ సరుకుల కోటా తగ్గిపోతుంది. ఆకలి కేకలు పెరుగుతాయి. అన్నింటికి మించి ఉపాధి పనులను వ్యవసాయానికి అనుబంధించాలన్న డిమాండ్ పట్టించుకోవడం లేదు. దేశంలో వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే సామాన్యులకు తిండిగింజలు దొరకడం లేదు. అధిక ధరలతో సామాన్యులు ఉప్పులు, పప్పులు కొనుక్కోలేక పోతున్నారు. ఈ సమస్యలను పార్లమెంటు చర్చించదు. బయటా చర్చించడం లేదు. దేశంలో నిరుద్యోగ తీవ్రత చాలా ఎక్కువగా వుంది. దేశంలో పని చేయగలిగిన శ్రామికుల సంఖ్య 64 శాతానికి పెరిగిందని, కేవలం 37 శాతం మందికి మాత్రమే పనులు దొరికాయని ఓ నివేదిక తెలిపింది. యువతకు ఉపాధి కల్పించడం దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్‌గా మారింది. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ ప్రభావంతో నిరుద్యోగం మరింత తీవ్రం కానుంది. ఐటి సేవల రంగాలలో తక్కువ నైపుణ్యం ఉంటే చాలన్న రీతిలో సాగుతోంది. ఐటి కంపెనీలు కూడా ఉద్యోగులను ఉన్న పళంగా తీసేస్తున్నాయి. ఈ క్రమంలో వ్యవసాయానుబంధ రంగాలను బలోపేతం చేయడం మినహా మరో గత్యంతరం లేదు. ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి రంగాలన్నింటికి నిధుల కేటాయింపులు తగ్గిపోతున్నాయి. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా నినాదాలను రాజకీయ ప్రచారం కోసం వాడుకుంటున్నారు. ప్రపంచీకరణ ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ సేవలు కుదించుకుపోయాయి. పేద, మధ్య తరగతి వారికి వచ్చే అరకొర ఆదాయం నుండి విద్య, వైద్యానికి చేసే ఖర్చులు పెరిగిపోయాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

ఆర్థిక అంతరాలను తగ్గించడానికి సంపన్నుల మీద పన్నులు వేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు.

# నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

### పక్కాగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం

### ఆప్ నేత కేజ్రీవాల్ ఆరోపణలపై రంగంలోకి ఎసిబి

### ఎసిబి రాకను అడ్డుకున్న ఆప్ నేతలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 7(తీన్మార్ న్యూస్) :** దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ముందు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థులకు భాజపా ఎరవేస్తోందని కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశించారు. దీంతో తక్షణమే రంగంలోకి దిగిన ఏసీబీ బృందం ఆప్ అధినేతకు లీగల్ నోటీసు పంపించింది. ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు చూపాలని అందులో పేర్కొంది. ఎన్నికల ఫలితాలకు ముందు రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

ఈ నెల 5న ఢిల్లీ ఎన్నికలు జరగగా 8న శనివారం ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఇందుకు ఇసి విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. 70 స్థానాలు ఉన్న అసెంబ్లీలో బిజెపి, ఆప్ మధ్య పోటాపోటీ జరిగింది. ఎగ్జిట్ పోల్ సర్వేలన్నీ బిజెపికి అనుకూలంగా ఉన్నాయని వెల్లడించాయి ఈ క్రమంలో పార్టీ మారేందుకు 16 మంది ఆప్ అభ్యర్థులకు భాజపా లంచాలు ఇవ్వజూపిందంటూ కేజ్రీవాల్ ఎక్స్‌లో చేసిన పోస్టును ప్రస్తావిస్తూ.. ఆ ట్వీట్ చేసింది మీరేనా? అని నిర్ధరించాలని ఏసీబీ పేర్కొంది. ఆ ఆరోపణలకు సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలని కోరింది. ఫోన్ కాల్ అందుకున్న ఆ 16మంది అభ్యర్థులు ఎవరు? వారికి వచ్చిన నంబర్లు, సంబంధిత సమాచారాన్ని అందించాలని తెలిపింది. దీంతోపాటు దిల్లీ ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేలా ఆరోపణలు చేస్తున్నందుకు చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరించాలని హెచ్చరించింది. ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎరవేసి, తమ పార్టీని అస్థిరపరచేందుకు భాజపా ప్రయత్నాలు చేస్తోందని అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల ఆరోపించారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా.. ఏసీబీ విచారణకు ఆదేశించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన అవినీతి నిరోధక శాఖ అధికారుల బృందం.. ఫిరోజ్‌షా రోడ్డులో ఉన్న కేజ్రీవాల్ నివాసానికి వెళ్లింది. ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించిన ఆప్ నేతలు.. ఏసీబీ అధికారులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎటువంటి లీగల్ నోటీసులు లేకుండా అధికారులు వచ్చారని, గంటన్నర తర్వాత నోటీసులు అందించారని ఆప్ లీగల్ సెల్ అధ్యక్షుడు సంజీవ్ నాసియార్ పేర్కొన్నారు. భాజపాతో కలిసి ఎల్జీ ఈ డ్రామా నడిపిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, కేజ్రీవాల్ ఆరోపణలు సరైనవేనని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ స్పష్టం చేశారు. 16మంది కంటే ఎక్కువ మందిని ఆప్ నుంచి దూరం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

## అమెరికాలోనూ ఉద్యోగుల కోత

### ట్రంప్ చర్యలతో స్వదేశంలోనూ వ్యతిరేకత



వాషింగ్టన్,ఫిబ్రవరి 7(తీన్మార్ న్యూస్):: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఇతర దేశాలపై టారిఫ్‌లు, ఆంక్షలతో విరుచుకుపడుతున్న ఆయన స్వదేశంలోనూ కొన్ని సంస్థల్లో సమూల ప్రక్షాళన చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచంలో అతిపెద్ద సహాయ సంస్థ అయిన 'అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ'లో ఏకంగా 9,700లకు పైగా ఉద్యోగాలు తొలగించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తోంది. ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా 10వేల మందికి పైగా ఉద్యోగులున్నారు. ఈ సంఖ్యను 300 దిగువకు తీసుకురావాలని చూస్తున్నారు. కేవలం 294 మంది మాత్రమే ఏజెన్సీలో పనిచేసేలా ట్రంప్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వీరిలో 12 మంది ఆఫ్రికా బ్యూరో, ఎనిమిది మంది ఆసియా బ్యూరోలో ఉండనున్నారట..! మిగతా 9700 మందికి త్వరలోనే ఉద్వాసన పలకనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. అయితే, దీనిపై అమెరికా విదేశాంగ శాఖ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ సహాయ సంస్థను తీవ్రవాద ఉన్మాదులు నడుపుతున్నారని, వాళ్లందరినీ వెళ్లగొట్టేస్తానని ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అటు డోజ్ విభాగ సారథి, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా దీనిపై మాట్లాడుతూ.. యూఎస్ఎయిడ్ నేరగాళ్ల సంస్థ అని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఇటీవల ఈ సంస్థలో వందలాది మంది ఉద్యోగులను సెలవుపై పంపించారు. దాదాపు 120 దేశాలకు మానవతా దృక్పథంతో సహాయం చేయడానికీ, ఆ దేశాల అభివృద్ధికీ, భద్రతకూ నిధులు సమకూర్చడానికీ యూఎస్ఎయిడ్‌ను నెలకొల్పారు. ఈ సంస్థ వందల కోట్ల డాలర్లను సహాయంగా అందిస్తోంది. సీసీపైనా ఆంక్షలు.. మరోవైపు, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనా ట్రంప్ ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై తాజాగా ఆయన సంతకం చేశారు. అమెరికా, దాని మిత్రదేశం ఇజ్రాయెల్ లక్ష్యంగా నిరాధార దర్యాప్తులు చేపడుతోందని ఈ సందర్భంగా అధ్యక్షుడు దుయ్యబట్టారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూపై అరెస్టు వారెంట్ జారీ చేసి అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు తన అధికారాలను దుర్వినియోగం చేసిందని మండిపడ్డారు. ఆంక్షల నేపథ్యంలో ఐసీసీ అధికారులు అమెరికాలో ప్రవేశించకుండా వారిపై నిషేధాజ్ఞలు అమలవుతాయి.

## ఆర్‌బీఐ కీలక నిర్ణయం..

### బ్యాంకుల డొమైన్ ఇక బ్యాంక్.ఇన్




**ముంబయి:** ఆర్థిక మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో వీటిని అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఇక భారత బ్యాంకున్నీ బ్యాంక్.ఇన్ ఇంటర్నెట్ డొమైన్ కలిగి ఉండాలని సూచించింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలకైతే ఫిన్.ఇన్ డొమైన్ ఉండాలని పేర్కొంది. ద్వైపాక్షిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాల వెల్లడి సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈవిషయాన్ని వెల్లడిం చారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బ్యాంక్.ఇన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఆపై ఫిన్.ఇన్ రిజిస్ట్రేషన్లు స్వీకరి స్తామని చెప్పారు. డిజిటల్ చెల్లింపుల్లో మోసాలు పెరుగుతున్న వేళ.. బ్యాంకులు, ఆర్థిక సంస్థలపై నమ్మకాన్ని పెంచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ తెలిపారు. ఇందులో భాగంగానే బ్యాంకు డొమైన్లు ప్రత్యేకంగా ఉండాలన్న ఉద్దేశంతో బ్యాంక్.ఇన్ ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. అసలు డొమైన్‌ను పోలిన వెబ్‌సైట్లతో సైబర్ నేరగాళ్లు ఫిషింగ్ మోసాలకు పాల్పుడుతున్న వేళ ఆర్‌బీఐ దీన్ని తీసుకొస్తుండడం గమనార్హం. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ దీనికి రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తుంది. అలాగే, దేశంలో జారీ అయిన కార్డుల ద్వారా ఇతర దేశాల్లో జరిగే లావాదేవీలకు అడిషనల్ ఫ్యాక్టర్ ఆఫ్ అథంటికేషన్‌ను జోడించనున్నట్లు గవర్నర్ చెప్పారు. ఇతర దేశాల్లో మర్చంట్ ఉన్నప్పుడు సురక్షిత లావాదేవీలు నిర్వహిం చాలన్న ఉద్దేశంతో దీన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పూర్తి వివరాలతో కూడిన ముసాయిదాను విడుదల చేస్తామన్నారు. భాగస్వామ్య పక్షాల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామని గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు.



# హోమ్‌లోన్ తీసుకున్న వారికి ఆర్‌బీఐ గుడ్‌న్యూస్..

### ఎంత ఆదా అవుతుంది?

గృహ రుణ వినియోగదారులకు ఎట్టకేలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. రెపో రేట్‌ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలోపెట్టుకుంటూనే వృద్ధికి ఊతం ఇవ్వాలన్న ఉద్దేశంతో 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దీనికి మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని చెప్పారు. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో రెపో రేటు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గింది. ఐదేళ్ల నుంచి వడ్డీ రేట్లు పెరగడం తప్ప.. తగ్గడం చూడని హోమ్‌లోన్ కస్టమర్లకు ఇది ఊరట కల్పించే అంశమనే చెప్పాలి. ఆ మేరకు ఈఎంఐ తగ్గనుంది.

### వడ్డీ ఎంత తగ్గనుంది?

ఆర్‌బీఐ తగ్గించిన రెపో రేటు పావు శాతమే (25 బేసిస్ పాయింట్లు) అయినప్పటికీ గృహరుణ వినియోగదారులు నెలవారీ చెల్లించే ఈఎంఐలో చాలావరకు తేడా కనిపిస్తుంది. ఉదాహరణకు 20 ఏళ్ల కాలవ్యవధికి రూ.50 లక్షల రుణం తీసుకున్నారనుకుందాం. 9 శాతం వడ్డీ అనుకుంటే నెలకు రూ.44,986 చెల్లించాల్సి ఉంటుంది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో ఆ మొత్తం రూ.44,186కు తగ్గనుంది. అంటే దాదాపు నెలకు రూ.800 ఆదా అవుతుంది. గృహరుణం తీరడానికి ఇంకా పదేళ్ల సమయం ఉందనుకుంటే 120 నెలలకు రూ.800 చొప్పున దాదాపు రూ.96వేల వరకు మిగులుతుంది.

### రుణ గ్రహీతల ముందు రెండు ఆప్షన్లు

- ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణ గ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉండబోతున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోమని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు.
- పై ఉదాహరణనే మళ్లీ తీసుకుంటే.. రూ.50 లక్షల రుణంపై 9 శాతం వడ్డీ రేటు కింద 20 ఏళ్లకు 57.96 లక్షలు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో 8.75 శాతం వడ్డీ తగ్గినప్పుడు ఈఎంఐని స్థిరంగా కొనసాగిస్తే.. దాదాపు 10 నెలల గడువు తగ్గుతుంది. దీంతో వడ్డీ మొత్తం 53.6 లక్షలకు తగ్గుతుంది. తద్వారా రూ.4 లక్షలపైనే ఆదా అవుతుంది. కాబట్టి రుణ కాల్యవధి ఆప్షన్‌ను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## యూఏవీలకై టెక్ఈగల్ రూ.100 కోట్ల పెట్టుబడి

ప్రజల భద్రత విషయంలో డ్రోన్లు, మానవరహిత విమానాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే మూడేళ్లలో ఈ రంగానికి సంబంధించి రూ.100 కోట్ల పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నట్లు 'టెక్ఈగల్' ఈరోజు(శుక్రవారం) వెల్లడించింది. పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ, ఇన్‌ఫ్లెక్షన్ పాయింట్ వెంచర్స్ సపోర్ట్ గల డ్రోన్ లాజిస్టిక్స్, యూఏవీ టెక్నాలజీ స్టార్టప్ 'టెక్ఈగల్'..యూఏవీ ఫస్ట్ రెస్పాండర్‌ను కూడా ప్రారంభించినట్లు తెలిపింది. వివిధ ఏజెన్సీలు, భద్రతా దళాలు, అంతర్జాతీయ అత్యవసర బృందాల నుంచి డ్రోన్లు, యూఏవీల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి సిద్ధంగా ఉన్నట్లు కంపెనీ పేర్కొంది. డ్రోన్ల సహాయంతో విపత్తు ప్రాంతాలను మ్యాప్ చేయడం, అత్యవసర సమయాల్లో నిఘాను అందించడం, రెస్క్యూ మిషన్ల వంటి అత్యవసర కార్యకలాపాలను వేగవంతం చేయొచ్చని కంపెనీ తెలిపింది. డ్రోన్.. వాయుమార్గాన (ఎయిర్‌బోర్న్) కమాండ్ యూనిట్‌గా పనిచేయడమే కాకుండా, సిట్యుయేషనల్ ఇంటెలిజెన్స్, ఆపరేషనల్ సపోర్ట్‌ను కూడా అందజేస్తుందని తెలిపింది.



## ఎల్ఐసీ లాభం రూ.11,506 కోట్లు..




ప్రభుత్వరంగ జీవితబీమా సంస్థ ఎల్ఐసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.11,506 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.9,444 కోట్లతో పోలిస్తే 17 శాతం పెరిగినట్లు ఎల్ఐసీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో ప్రీమియంల ద్వారా వచ్చే ఆదాయం రూ.1,06,891 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే సమయంలో రూ.1,17,017 కోట్లతో పోలిస్తే ప్రీమియంల ద్వారా వచ్చే ఆదాయం తగ్గడం గమనార్హం. సంస్థ మొత్తం ఆదాయం సైతం రూ.2,12,447 కోట్ల నుంచి రూ.2,01,994 కోట్లకు తగ్గిందని ఎల్ఐసీ తెలిపింది. ఫలితాల నేపథ్యంలో మార్కెట్ ముగిసే సమయానికి ఎల్ఐసీ షేరు 2.15 శాతం క్షీణించి రూ.811 వద్ద ముగిసింది.

## మూడో రోజూ సూచీలకు నష్టాలే!




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. అందరూ ఊహించినట్లుగా వృద్ధికి ఊతం ఇచ్చేందుకు ఆర్‌బీఐ రెపోరేటును 25 బేసిస్ పాయింట్లను తగ్గించినప్పటికీ.. 'తటస్థ' వైఖరిని కొనసాగించడం, బ్యాంకుల్లో లిక్విడిటీని పెంచేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో వరుసగా మూడో రోజూ సూచీలు నష్టాల్లో కొనసాగాయి. నిఫ్టీ 23,600 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 78,119.60 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,058.16) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభం నుంచి ఒడుదొడుకులు ఎదుర్కొంటూ వచ్చింది. ఇంట్రాడేలో 77,475.74 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 197.97 పాయింట్ల నష్టంతో 77,860.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 43.40 పాయింట్ల నష్టంతో 23,559.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 15 పైసలు బలపడి 87.42 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అదానీ పోర్ట్స్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, జొమాటో, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.93 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2,888 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఇన్ఫోసిస్- మైసూరు ఆఫీసులో లేఆఫ్‌లు..

## 400 మంది ట్రైనీల తొలగింపు!




ఫ్రెషర్ల నియామకాల విషయంలో ఆ మధ్య తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఇన్ఫోసిస్ ఎట్టకేలకు గతేడాది వారిని విధుల్లోకి తీసుకుంది. అయితే, ఇందులో కొంతమందికి సంస్థ తాజాగా ఉద్వాసన పలికినట్లు తెలుస్తోంది. కర్ణాటకలోని మైసూరు క్యాంపస్‌లో దాదాపు 400 మంది ట్రైనీలకు లేఆఫ్‌లు ప్రకటించినట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. వరుస ఎవాల్యుయేషన్ పరీక్షల్లో విఫలమవడంతో వారిని తొలగించినట్లు తెలుస్తోంది. గతేడాది అక్టోబర్‌లో ట్రైనీలుగా చేరిన వారిలో సగం మందిపై వేటు పడినట్లు సమాచారం. వరుసగా మూడు ఎవాల్యుయేషన్ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారిని తొలగిస్తున్నారట. ట్రైనీలను బ్యాచ్‌ల వారీగా పిలిచి వారితో 'మ్యూచువల్ సెపరేషన్' లెటర్లపై సంతకాలు చేయించుకుంటున్నట్లు సదరు కథనాలు తెలిపాయి. అయితే, దీనిపై ఇన్ఫోసిస్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. "ఇది చాలా అన్యాయం. మేం ఫెయిల్ అవ్వాలనే ఉద్దేశంతోనే ఆ పరీక్షలను చాలా కఠినంగా పెట్టారు. ఇప్పుడు మా భవిష్యత్తు కష్టంగా మారింది" అని ఉద్వాసనకు గురైన ఓ ట్రైనీ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల్లోపు ట్రైనీలంతా క్యాంపస్‌ను వీడాలని అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. ఈ పరిణామాలపై నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనెట్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై కార్మిక శాఖకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపింది. 2022-23 నియామక ప్రక్రియలో భాగంగా 2000 మంది ఫ్రెషర్లను ఇన్ఫోసిస్ ఎంపిక చేసింది. సిస్టమ్ ఇంజినీర్, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజినీర్ తదితర పోస్టులకు ఎంపిక చేస్తూ, వారికి అదే ఏడాది ఆఫర్ లెటర్లు ఇచ్చింది. వారంతా 2022 బ్యాచ్ ఉత్తీర్ణులు. అన్ని రకాల పరీక్షలను పూర్తి చేసినా వీరిని విధుల్లోకి తీసుకోవడంలో మాత్రం ఆలస్యం చేస్తూ వచ్చారు. దీంతో కంపెనీపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో పాటు కార్మిక శాఖ వద్ద ఫిర్యాదు సైతం నమోదైంది. ఈ క్రమంలో రెండేళ్లు ఆలస్యంగా 2024 ఏప్రిల్‌లో వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంది.



## పెరిగిన ఓలా ఎలక్ట్రిక్ నష్టం..

### దెబ్బకొట్టిన సర్వీసుల సమస్య!

ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.564 కోట్ల నికర నష్టం వచ్చినట్లు శుక్రవారం కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ప్రకటించిన రూ.376 కోట్ల నష్టంతో పోలిస్తే నష్టాలు మరింత పెరగడం గమనార్హం. పెరిగిన పోటీ కారణంగా ఆదాయాలు తగ్గుముఖం పట్టడం, సేవా లోపాలను సరిదిద్దేందుకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయడం వంటివి ఇందుకు కారణమయ్యాయి. సమీక్షా త్రైమాసికంలో కార్యకాలపాల ద్వారా వచ్చే ఆదాయం రూ.1296 కోట్ల నుంచి రూ.1045 కోట్లకు తగ్గినట్లు కంపెనీ తెలిపింది. అదే సమయంలో ఖర్చులు రూ.1505 కోట్ల నుంచి రూ.1597 కోట్లకు పెరిగినట్లు పేర్కొంది. "పండగ సీజన్ కారణంగా అక్టోబర్‌లో మెరుగైన అమ్మకాలు నమోదు చేసినప్పటికీ.. ఈవీ మార్కెట్‌లో పెరిగిన పోటీ, సర్వీసు సమస్యలను అధిగమించడం, నెట్‌వర్క్‌ను మరింత విస్తరించడం వంటి మార్కెట్ వాటా, మార్జిన్లపై ప్రభావం చూపాయి" అని కంపెనీ షేర్ హోల్డర్లకు రాసిన లేఖలో పేర్కొంది. ఓలా కస్టమర్ల నుంచి ఫిర్యాదుల పరిష్కారం, వారెంటీ ఖర్చుల కోసం రూ.110 కోట్లు ఖర్చు చేసినట్లు ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. టెక్నాలజీ ఆధునికీకరణ, జనరేషన్ 3 వాహనాలు తీసుకురావడం వల్ల వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఆయా ఖర్చులు తగ్గుముఖం పడతాయని ఆశాభావం వ్యక్తంచేసింది. అలాగే, ఉద్యోగుల హేతుబద్ధీకరణ కోసం వన్‌టైమ్ పేమెంట్ కింద రూ. 13 కోట్లు ఖర్చయినప్పటికీ.. ఉద్యోగులకయ్యే ఖర్చు దాదాపు 17 శాతం మేర తగ్గినట్లు కంపెనీ తెలిపింది. నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు మరింత వెచ్చించనున్నట్లు తెలిపింది.

## రతన్ టాటా వీలునామాలో రహస్య వ్యక్తి పేరు!



దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా అంటే లక్షల కోట్ల సామ్రాజ్యానికి అధిపతిగానే కాదు.. ఒక మహోన్నత మానవతామూర్తిగా, సమాజ సేవకుడిగా పేరు సంపాదించుకున్నారు. కాగా ఆయనకున్న వేల కోట్ల ఆస్తిని తన వద్ద పనిచేస్తున్న వారికి, పెంపుడు శునకాలకు ఇస్తూ వీలునామా రాసిన విషయం తెలిసిందే. కాగా తాజాగా బయటకు వచ్చిన మరో వీలునామా చూసి ఆయన సన్నిహితులు ఆశ్చర్యపోయారు. అందులో ఓ రహస్య వ్యక్తికి తన ఆస్తిలో రూ.500 కోట్లు ఇవ్వాలని రతన్‌టాటా పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఆ రహస్య వ్యక్తి జంషెడ్‌పూర్‌కు చెందిన ట్రావెల్స్ వ్యాపారవేత్త మోహిని మోహన్ దత్తా అని పలు మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. మోహన్ దత్తా ఆరు దశాబ్దాలకు పైగా రతన్‌టాటా దగ్గర నమ్మకంగా పని చేశారు. తాజ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్‌లో భాగమైన తాజ్ సర్వీసెస్‌తో 2013 నుంచి మోహన్‌దత్తాకు చెందిన "స్టాలియన్ ట్రావెల్ ఏజెన్సీ" కలిసి పనిచేస్తోంది. టాటా గ్రూప్‌నకు చెందిన అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మోహన్‌దత్తా టాటా కుటుంబానికి చాలా సన్నిహితంగా ఉండేవారు. రతన్ టాటా మరణించినప్పుడు దత్తా ఆయనతో ఉన్న అనుబంధం గురించి మాట్లాడుతూ రతన్‌టాటా 24 ఏళ్ల వయసు ఉన్నప్పటినుంచి తనకు తెలుసని అన్నారు. తాను జీవితంలో ఎదగడానికి ఆయన ఎంతో సాయం చేశారని గుర్తు చేసుకున్నారు. డిసెంబర్ 2024లో ముంబయిలోని ఎన్సీపీఏలో నిర్వహించిన రతన్ టాటా జన్మదిన వేడుకలకు దత్తాను ఆహ్వానించినట్లు సమాచారం. రతన్ టాటా మరణానంతరం బయటకు వచ్చిన వీలునామాలో మూడు దశాబ్దాలుగా తనవద్ద పని చేస్తూ, తోడుగా ఉన్న వ్యక్తిగత సహాయకులు రాజన్ షా, సుబ్బయ్య, పెంపుడు శునకం టిటో పేర్లను చేర్చినట్లు సమాచారం. టాటాకు ఉన్న దాదాపు రూ.10,000 కోట్ల ఆస్తులు.. ఆయన నెలకొల్పిన ఫౌండేషన్‌లకు, సోదరుడు జిమ్మీ టాటాకు, తన సహాయకులు, ఇతరులకు చెందుతాయని అందులో రాసినట్లుగా సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

## వచ్చే వారమే ఐఫోన్ ఎస్ఈ 4.. నెలాఖరున విక్రయాలు!

సాధారణంగా ఐఫోన్‌లంటే ఖరీదు ఎక్కువ. అలా పెద్దమొత్తం పెట్టి కొనలేని వారికోసం ఎస్ఈ మోడళ్లను యాపిల్ తీసుకొస్తూ ఉంటుంది. అలా 2016 నుంచి (2020, 2022) ఇప్పటి వరకు మూడు మోడళ్లను తీసుకొచ్చింది. తాజాగా తదుపరి తరం ఐఫోన్ ఎస్ఈ మోడల్‌ను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోందని 'బ్లూమ్‌బెర్గ్' పేర్కొంది. వచ్చేవారమే దీన్ని విడుదల చేయనుందని సమాచారం. ఈ నెలాఖరులో అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. ఐఫోన్ ఎస్ఈ 3ని 2022లో యాపిల్ లాంచ్ చేసింది. 'పీక్ పర్ఫార్మెన్స్' అనే ఈవెంట్‌లో యాపిల్ దీన్ని విడుదల చేసింది. అయితే కొత్త ఎస్ఈ 4ను ఎలాంటి ఈవెంట్ నిర్వహించకుండా.. నేరుగా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తేనున్నట్లు తెలుస్తోంది. అమెరికాతో పాటు భారత్‌లోనూ వెబ్‌సైట్ ద్వారా విక్రయాలు జరపనున్నట్లు సమాచారం. గత ఎస్ఈ మోడల్ ధరను కంపెనీ రూ.43,900గా నిర్ణయించింది. ఎస్ఈ 4 దీనికంటే ఎక్కువ ధర ఉండే అవకాశం ఉందని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక ఫీచర్ల విషయానికొస్తే.. కొత్త ఎస్ఈ మోడల్ ఐఫోన్ 14ను పోలి ఉండనుంది. అంటే తొలిసారి హోమ్ బటన్, టచ్ ఐడీ లేకుండా ఈ స్పెషల్ ఐడీ రానుందని తెలుస్తోంది. దాని బదులు గెశ్చర్ నావిగేషన్, ఫేస్ ఐడీ ఉండబోతోంది. అలాగే, యూఎస్‌బీ టైప్-సి పోర్ట్‌తో యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్లతో ఈ ఫోన్ రానుంది. ఐఫోన్ 16లో వాడిన ఏ18 చిప్‌ను ఇందులో వాడుతున్నట్లు తెలుస్తోంది. 6.1 అంగుళాల ఓఎల్ఈడీ డిస్‌ప్లే ఉండబోతోంది. అంటే ఎస్ఈ 3తో పోలిస్తే (4.7 అంగుళాలు) సైజ్ పరంగా కూడా కొత్త మోడల్ పెద్దగా ఉండబోతోంది. దీని విడుదల సమయంలో మరిన్ని వివరాలు తెలియరానున్నాయి.



# సినిమా చూస్తుంటే.. కెప్టెన్ నుంచి ఫోన్




## శ్రేయస్ అయ్యర్

అనూహ్యంగా తుది జట్టులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ సత్తా చాటాడు. భీకరమైన బౌలర్ జోఫ్రా ఆర్చర్‌పై ఆధిపత్యం ప్రదర్శించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో శ్రేయస్ ఆకట్టుకున్నాడు. విరాట్ కోహ్లీ మోకాలి గాయం వల్ల తుది జట్టు నుంచి వైదొలగడంతో శ్రేయస్‌కు ఛాన్స్ వచ్చింది. స్వల్ప వ్యవధిలో ఓపెనర్లు పెవిలియన్‌కు చేరిన అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన శ్రేయస్ వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి మూడో వికెట్‌కు 94 పరుగులు జోడించాడు. ఈక్రమంలో కేవలం 36 బంతులకే 59 పరుగులు చేశాడు. అయితే, మ్యాచ్‌లో ఆడటంపై ఓ ఫన్నీ స్టోరీ ఉందని అయ్యర్ వెల్లడించాడు. "మ్యాచ్‌కు ముందురోజు రాత్రి ఓ సినిమా చూస్తూ ఉన్నా. ఆ రాత్రంతా అలానే చూస్తూ ఉండాలనుకున్నా. ఎలాగూ ఛాన్స్ రాదనే భావన. అప్పుడే కెప్టెన్ రోహిత్ శర్మ నుంచి ఫోన్ వచ్చింది. విరాట్ కోహ్లీకి మోకాలిలో వాపు వచ్చింది. నువ్వు మ్యాచ్‌లో ఆడాల్సి ఉంటుందన్నారు. వెంటనే నా రూమ్‌కు వెళ్లి నిద్రపోయా. అందుకే, నాకు ఈ విజయం, ఈ ఇన్నింగ్స్ రెండూ గుర్తుండిపోతాయి. విరాట్‌కు గాయం కావడం వల్లే నాకు అవకాశం వచ్చింది. కానీ, నేను మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగానే ఉన్నా. ఎప్పుడైనా ఛాన్స్ వస్తుందని నాకు తెలుసు" అని శ్రేయస్ తెలిపాడు. "ఇలాంటిదే గత ఆసియా కప్ సమయంలోనూ చోటుచేసుకుంది. నేను గాయపడటంతో నా ప్లేస్‌లోకి మరొక ప్లేయర్ వచ్చాడు. అతడు సెంచరీ సాధించాడు. ఇలా జరగడం ఆటలో సహజమే. నేను గత దేశవాళీ సీజన్ మొత్తం ఆడా. అక్కడ చాలా పాఠాలు నేర్చుకున్నా. ఇన్నింగ్స్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లాలో తెలుసుకున్నా. నా వైఖరిని మార్చుకోలేదు. నేను ఆడే విధానం మెరుగుపర్చుకున్నా" అని శ్రేయస్ తెలిపాడు.

## శ్రేయస్ కాన్ఫిడెన్స్ అదుర్స్.. పక్కన పెట్టొద్దు : జహీర్ ఖాన్




ఇంగ్లండ్‌తో తొలి వన్డే మ్యాచ్ లో భారత్ ఘన విజయం సాధించింది. శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్ హాఫ్ సెంచరీలు సాధించారు. విరాట్ కోహ్లీ కి మోకాలి వాపు కారణంగా తుది జట్టులోకి శ్రేయస్ వచ్చాడు. ఈ విషయాన్ని అతడే మ్యాచ్ అనంతరం వెల్లడించాడు. అద్భుతమైన హాఫ్ సెంచరీతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. శ్రేయస్ ఆత్మవిశ్వాసం అద్భుతమని.. తదుపరి మ్యాచుల్లోనూ ఇలాగే కొనసాగిస్తే బాగుంటుందని భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్ వ్యాఖ్యానించాడు. రెండో వన్డే నాటికి విరాట్ సిద్ధమవుతాడని ఇప్పటికే వైస్ కెప్టెన్ గిల్ వెల్లడించిన సంగతి తెలిసిందే. "ప్రతిఒక్కరూ శ్రేయస్ ఇన్నింగ్స్ గురించి మాట్లాడుతున్నారు. కానీ, అతడు ఎదురుదాడి చేసిన తీరు అద్భుతం. అప్పటికే భారత్ రెండు వికెట్లను కోల్పోయి ఉంది. ఆ సమయంలో ఎవరైనా సరే కాస్త నెమ్మదిగా ఆడేందుకు ప్రయత్నిస్తారు. కానీ, శ్రేయస్ కాన్ఫిడెన్స్ స్థాయి అద్భుతంగా ఉండటంతో ప్రత్యర్థిపై దూకుడు ప్రదర్శించాడు. పిచ్ నుంచి బౌలర్లకు కాస్త సహకారం లభిస్తోంది. అలాంటప్పుడు లక్ష్య ఛేదన విషయంలో మేం వెనకడుగు వేసేదే లేదంటూ శ్రేయస్ ముందుకుసాగాడు. శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ పార్టనర్‌షిప్ జట్టు విజయంలో కీలకం. అందుకే, మంచి ఫామ్‌లో ఉన్న బ్యాటర్‌ను పక్కనపెట్టడం సరైంది కాదు" అని జహీర్ వెల్లడించాడు.

## హార్దిక్ పాండ్యనే తదుపరి కెప్టెన్!




ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో భారత తలపడుతోంది. ఆ తర్వాత ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగనుంది. రోహిత్‌కు డిప్యూటీగా శుభ్‌మన్ గిల్‌ను మేనేజ్‌మెంట్ ఎంపిక చేసింది. ఒకవేళ ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ఇండియాకు సానుకూల ఫలితాలు రాకపోతే జట్టులో పెద్ద మార్పులు ఉంటాయని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్ కథనం ప్రకారం.. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు పరాభవం ఎదురైతే హార్దిక్‌ను వన్డేలకు కెప్టెన్‌గా నియమిస్తారని తెలుస్తోంది. "ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు హార్దిక్ పాండ్యను వైస్ కెప్టెన్‌గా నియమించాలని ఉంది. కానీ, రోహిత్ శర్మ, అజిత్ అగార్కర్ మాత్రం శుభ్‌మన్ గిల్ వైపే మొగ్గు చూపారు. ఇక టీ20ల్లో సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్సీ ఉంది. అతడి ఫామ్ ఇబ్బందికరంగా మారింది. దీంతో ఆ జట్టు పగ్గాలను కూడా హార్దిక్ కు అప్పగించే అవకాశం లేకపోలేదు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఫలితం పైనే సారథ్య బాధ్యతలు ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుత కెప్టెన్ రోహిత్ శర్మ మెగా టోర్నీ తర్వాత వన్డేలకు గుడ్‌బై చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు. గిల్ డిప్యూటీగా ఉన్నప్పటికీ.. హార్దిక్ మంచి ప్రదర్శన చేస్తే అతడికే కెప్టెన్సీ దక్కనుంది. హార్దిక్‌కు చాలా అన్యాయం జరిగిందనే భావన బీసీసీఐలోని పలువురితోపాటు గంభీర్‌కు ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే పాండ్యను పరిమిత ఓవర్ల క్రికెట్‌కు కెప్టెన్‌గా నియమిస్తారు" అని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి.

## నేను దేశం కోసం ఆడుతున్నా.. అవేవీ పట్టించుకోను : హర్షిత్ రాణా




ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో భాగంగా కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన హర్షిత్ భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అప్పుడు అది తీవ్ర వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇంగ్లండ్‌తోనే వన్డే సిరీస్‌ను భారత్ ఆడుతోంది. తాజాగా 50 ఓవర్ల క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన హర్షిత్ కీలక వికెట్లు పడగొట్టాడు. మూడు వికెట్లు తీసి తన సత్తా ఏంటో నిరూపించాడు. ఈక్రమంలో కంకషన్ వివాదంపై హర్షిత్ కీలక వ్యాఖ్యలు చేశాడు. "బయట క్రికెట్‌ను చూసే ప్రతిఒక్కరూ ఏదోఒకటి మాట్లాడుకుంటూనే ఉంటారు. మంచో, చెడో నేను మాత్రం ఆడాలనే కోరుకుంటా. వారి వ్యాఖ్యలను పట్టించుకోను. నా దేశం కోసం బరిలోకి దిగుతా. అంతేకానీ, వాటికి స్పందించాల్సిన అవసరం లేదు" అని హర్షిత్ వ్యాఖ్యానించాడు. "అంతర్జాతీయ వన్డే ఫార్మాట్‌లోకి అరంగేట్రం చేస్తానని ముందు తెలియదు. మైదానంలోకి వచ్చాకనే తెలిసింది. అయితే, నేను మానసికంగా అప్పటికే సిద్ధమై ఉన్నా. ఎప్పుడు అవకాశం వచ్చినా అత్యుత్తమ ప్రదర్శన చేయాలని భావించా. తొలి ఓవర్‌లోనే భారీగా పరుగులు ఇచ్చా. అయితే, క్రికెట్‌లో ఒడిదొడుకులు సహజమే. లెంగ్త్ పైనే దృష్టిసారించా. ఎక్కడ సంధిస్తే వికెట్ వస్తుందో తెలిసింది. రెండో స్పెల్‌లో ప్రత్యేకంగా ఏమీ చేయలేదు. సరైన ప్రాంతంలోనే బంతిని విసిరా" అని హర్షిత్ తెలిపాడు.

## నాకు ముందే తెలుసు

**- అక్షర్ పటేల్**

బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చిన అక్షర్ పటేల్ (52) హాఫ్ సెంచరీ సాధించాడు. గిల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు శతక భాగస్వామ్యం నిర్మించాడు. మ్యాచ్ అనంతరం అక్షర్ మాట్లాడుతూ.. "ఎడమ – కుడి కాంబినేషన్ నేపథ్యంలో నేను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకువస్తానని తెలుసు. హాఫ్ సెంచరీ సాధించడం బాగుంది. బౌలింగ్‌లోనూ కీలక సమయంలో వికెట్లు దక్కాయి. పవర్ ప్లేలో స్పిన్‌తో కట్టడి చేయాలని భావించాం. సరైన ప్లేస్‌లో బంతిని సంధిస్తేనే ఫలితం సానుకూలంగా ఉంటుందని భావించాం. అందుకు తగినట్లుగానే వేసి వికెట్లు తీశాం" అని అక్షర్ వెల్లడించాడు.

### అక్షర్‌ను ముందుకు తీసుకురావడంపై రోహిత్

"మేం చాన్నాళ్ల తర్వాత వన్డే క్రికెట్ ఆడాం. తొలి మ్యాచ్‌లోనే విజయం సాధించాం. ఆరంభం నుంచే మేం అంచనాలకు తగినట్లుగా ఆడాం. ఇంగ్లండ్ ఓపెనింగ్ బాగున్నప్పటికీ.. మళ్లీ మేం పుంజుకున్నాం. ఎడమ చేతివాటం బ్యాటర్లకు స్పిన్ బౌలింగ్‌ను ఆడటం సులువనే ఉద్దేశంతో అక్షర్ పటేల్‌ను ముందుకు పంపించాం. గిల్, అక్షర్ అద్భుతంగా ఆడారు" అని కెప్టెన్ రోహిత్ తెలిపాడు.



## రోహిత్ మాటలు ధైర్యాన్నిచ్చాయి..

### వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్



భారత వన్డే జట్టుకు వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపికైన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లోనే అద్భుతమైన ఇన్నింగ్స్‌తో గిల్ (87) అదరగొట్టాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నాడు. మైదానంలో తనకు కెప్టెన్ రోహిత్ నుంచి పూర్తి స్థాయిలో మద్దతు లభిస్తోందని గిల్ తెలిపాడు. ఏ విషయం చెప్పాలనుకున్నా నిర్మొహమాటంగా చెప్పమని రోహిత్ సూచించినట్లు శుభ్‌మన్ వెల్లడించాడు. "నా బ్యాటింగ్ స్టైల్‌లో పెద్దగా మార్పులు లేవు. కానీ, ఆడే విధానం మార్చుకున్నా. సానుకూల దృక్పథంతో ఆడాను. కొత్త బంతితో పేసర్లకు అనుకూలంగా ఉంటుందని తెలుసు. బ్యాటర్‌గా 70ల్లోకి వచ్చాక పుల్‌షాట్లను ఆడేందుకు ప్రయత్నించా. శ్రేయస్ ముందే పేసర్లపై ఎదురుదాడి మొదలుపెట్టాడు. అది మాకు కలిసొచ్చింది. వైస్ కెప్టెన్‌గా మైదానంలోనూ సారథికి అవసరమైన సూచనలు ఇవ్వడానికి సిద్ధంగా ఉంటా. రోహిత్ కూడా ఆ విషయంలో ఏమాత్రం ఇబ్బందిపడొద్దని చెబుతాడు. అతడి మాటలు ఎంతో ధైర్యానిచ్చాయి. ఏవైనా సూచనలు ఇచ్చినా తీసుకుంటాడు. కెప్టెన్‌గా అతడు ఎలా ఆలోచిస్తాడనే దానిని తెలుసుకుంటున్నా" అని వెల్లడించాడు. కోహ్లీ ఫిట్‌నెస్‌పైనా గిల్ ఓ స్పష్టత ఇచ్చాడు. "ఉదయం నిద్ర లేచిన తర్వాత మోకాలి వాపు వచ్చినట్లు కోహ్లీ గుర్తించాడు. అందుకే, అతడికి విశ్రాంతి ఇచ్చాం. అదేమీ పెద్ద సమస్యకాదు. రెండో మ్యాచ్‌కు వచ్చేస్తాడు" అని గిల్ తెలిపాడు.

## జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో భారత్‌కే ఆందోళన: పాక్ కోచ్ ఆకిబ్



భారత ప్రధాన బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇంగ్లండ్‌తో మూడో వన్డే నాటికి జట్టుతోపాటు చేరతాడని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరికొన్ని రోజుల్లో ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానున్న నేపథ్యంలో భారత్‌కు బుమ్రా అత్యంత కీలకం. పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌తో కూడిన గ్రూప్‌లో టీమ్ఇండియా తలపడనుంది. ఈక్రమంలో పాక్ తాత్కాలిక కోచ్ ఆకిబ్ జావెద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'బుమ్రా ఫిట్‌నెస్ విషయంలో భారత్ కాస్త ఆందోళనలో ఉన్నట్లు అనిపిస్తోంది. ఛాంపియన్స్ ట్రోఫీలో ప్రతి జట్టును తేలిగ్గా తీసుకోకూడదు. అత్యుత్తమమైన ఎనిమిది టీమ్‌లు తలపడనున్నాయి. జస్‌ప్రీత్ బుమ్రా వంటి బౌలర్ జట్టులో ఉంటే ఎవరికైనా ప్లస్ పాయింటే. మేం మాత్రం అతడిని ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా ప్రణాళికలేమీ సిద్ధం చేసుకోలేదు" అని వెల్లడించాడు.

**అదే మంచి ఎంపిక..** ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన జట్టుపై మాజీల నుంచి వచ్చిన విమర్శలను ఆకిబ్ కొట్టిపడేశాడు. "ఏదో రెండు మ్యాచుల్లో ప్రదర్శన ఆధారంగానే జట్టులో మార్పు చేశామనడం సరికాదు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందునుంచి అనుకున్న జట్టునే ఎంపిక చేశాం. గ్రూప్ స్టేజ్‌లో మూడు మ్యాచ్‌లు ఆడాల్సిఉంది. ఏడుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు, నలుగురు బౌలర్లు. ఇందులోనే ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉన్నారు. ఫహీమ్, ఖుష్దిల్ మంచి ఎంపిక. ఎందుకంటే ఉపఖండ పిచ్‌లపై రాణిస్తారనే నమ్మకం ఉంది" అని వెల్లడించాడు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు గడాఫీ స్టేడియం సిద్ధం: పీసీబీ

లాహోర్: ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీతో సహా అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు లాహోర్‌లోని గడాఫీ స్టేడియం సిద్ధంగా ఉందని పీసీబీ ప్రకటించింది. స్టేడియం పునర్నిర్మాణం, నవీకరణ పనులు రికార్డు స్థాయిలో 117 రోజుల్లోనే పూర్తయ్యాయని గురువారం వెల్లడించింది. పునరుద్ధరించిన గడాఫీ స్టేడియంలో నూతన ఫ్లడ్‌లైట్లు, కార్పొరేట్ బాక్సులు, ఎలక్ట్రానిక్ స్కోరుబోర్డులు, ఎల్ఈడీ టవర్లు సహా మెరుగైన వసతులు ఏర్పాట్లు చేసినట్లు పీసీబీ తెలిపింది. స్టేడియం సీటింగ్ సామర్థ్యం పెంచినట్లు చెప్పింది. శుక్రవారం పాక్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ స్టేడియాన్ని అధికారికంగా ప్రారంభిస్తారు. "భయాలు, విమర్శలు వెల్లువెత్తినప్పటికీ స్టేడియాన్ని సకాలంలో సిద్ధం చేయడానికి పగలు, రాత్రి పనిచేసిన వారందరికీ కృతజ్ఞతలు" అని పీసీబీ చీఫ్ మోసిన్ నక్వి తెలిపాడు. స్టేడియంలో పనుల్ని పూర్తిచేయడంలో పీసీబీ కనీసం అయిదు వారాలు వెనుకంజలో ఉన్నట్లు ఇటీవల కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో గడాఫీ స్టేడియం సిద్ధమైనట్లు పీసీబీ ప్రకటించింది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఈనెల 12లోపు లాహోర్, కరాచి, రావల్పిండి స్టేడియాల్ని ఐసీసీకి పీసీబీ అప్పగించాలి. కరాచి స్టేడియంలో ఇంకా పనులు పూర్తి కాలేదు.



# నాగచైతన్య, సాయిపల్లవి సినిమా
# 'తండేల్' ఎలా ఉందంటే.!

**నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన 'తండేల్'పై ఆడియన్స్‌కి ఆసక్తిని రెట్టింపు చేశాయి. మరి అందరి అంచనాలనూ 'తండేల్' అందుకున్నాడా? అనుకున్నట్టుగా సినిమా విజయం సాధించిందా? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే ముందు కథలోకి వెళ్లాలి..**



## రివ్యూ

శ్రీకాకుళం జిల్లా మత్స్యలేశ్యం గ్రామానికి చెందిన జంట రాజు(నాగచైతన్య), సత్య(సాయిపల్లవి). ఇద్దరూ మత్యకారుల కుటుంబాలకు చెందినవారే. చిన్నప్పట్నుంచీ కలిసి పెరిగారు. కలిసి బతకాలనుకున్నారు. సత్యకు రాజు అంటే ప్రాణం. రాజుకు సత్యే లోకం. రాజు చేపల వేటకు వెళ్లి నెలల తరబడి రాకపోయినా అతని జ్ఞాపకాలతో బతికేస్తుంది సత్య. తనవారికోసం నిలబడే తెగువ, ధైర్యం, మంచితనం.. ఇవన్నీ రాజును తమ జాతికి తండేల్‌గా నిలబెట్టాయ్. అయితే.. చాపలవేటకు వెళ్లి సముద్రంలో ప్రాణాలు కోల్పోతున్న తనవాళ్లను చూస్తూ సత్య మనసులో కలవరం మొదలైంది. ఎలాగైనా రాజుతో చేపలవేట మాన్పించాలని ప్రయత్నిం చింది. కానీ.. రాజు మాత్రం సత్య మాట వినలేదు. బాధ్యతకోసం కట్టుబడి, తనను నమ్మకు న్నవారి కోసం వేటకు వెళ్లాడు. సత్య మనసు గాయపడింది. తన మాటను పెడచెవిన పెట్టిన రాజును మనసు లోంచి చెరిపేయాల నుకుంది. మరొకరితో పెళ్లికి సిద్ధమైంది. ఇంతలో పిడుగులాంటి వార్త. సముద్రంలో చేపలవేటకు వెళ్లిన రాజు బృందం.. అక్కడ తుఫాన్‌లో చిక్కుకొని, అందులోంచి బయట పడే ప్రయత్నంలో తమ ప్రమేయం లేకుండానే పాకిస్తాన్ సముద్ర జలాల్లోకి ప్రవేశించి పాకిస్తాన్ నేవీ అధికారులకు దొరికిపోయారు. ఈ వార్త విని మత్స్యలేశం గ్రామం విలవిలలా డింది. సత్య షాక్‌కు గురైంది. మరి పాకిస్తాన్ కరాచీ సెంట్ర ల్‌జైల్‌లో బంధీలుగా ఉన్న రాజు బృందం ఎలా బయటపడింది? సత్య వేరొకరిని పెళ్లాడిందా? శత్రుదేశంలో బంధీగా చిక్కుకున్న రాజుకోసం సత్య చేసిన ప్రయత్నాలేంటి? చివరకు సత్య, రాజుల ప్రేమకథ సుఖాంతమైం దా? దుఖాంతంగా మిగిలిపోయిందా? ఈ ప్రశ్నలకు సమాధా నమే మిగతా కథ. విశ్లేషణ ఇది వాస్తవ సంఘటనల ఆధారంగా తీసిన కథ అని ప్రచారంలో చెప్పినా.. కొత్త కథైతే కాదు. ఒక్క లైన్‌గా చెప్పుకుంటే మణిరత్నం 'రోజా' కథా, ఈ కథ ఒక్కటే. అయితే.. కథనం, నేపథ్యం, సినారియో, క్యారెక్టరైజేషన్స్ ఇవన్నీ డిఫరెంట్. అందుకే ఓ కొత్త ప్రపంచాన్ని చూసినట్టు అనిపించింది. కుటుంబాల కోసం సముద్రంలోనే నెలల తరబడి జీవితాలు సాగించే మత్స్యకారులు. వారి రాకకోసం కళ్లలో వత్తులు పెట్టుకొని మరీ ఎదురుచూసే కుటుంబాలు.. ఈ నేపథ్యాల మధ్య ఓ అందమైన ప్రేమకథ.. మధ్యలో భయంకరమై కుదుపు.. దాన్నుంచి బయటపడే ప్రయత్నాలు.. మొత్తంగా ఇదే 'తండేల్' సినిమా. వాస్తవ సంఘటనలకు ఫిక్షన్ జోడించి దర్శకు డు చందూ మొండేటి సినిమాను తెరకెక్కించాడు.. హీరోహీరో యిన్ల ప్రేమ.. విరహం.. రొమాన్స్.. వీటితోపాటు తండేల్ రాజు పాత్రను పరిచయం చేసేందుకు కొన్ని మసాలా సీన్స్.. మొత్తంగా ఇదే ఫస్టాఫ్. పెద్దగా కథ లేకపోయినా.. విసుగైతే ఉండదు. ముఖ్యంగా సాయిపల్లవి, నాగచైన్య మధ్య వచ్చే ప్రేమ సన్నివేశాలు.. వారిద్దరి కెమిస్ట్రీ.. వాటిని ఓ రేంజ్‌లో ఎలివేషన్స్ ఇస్తూ దేవిశ్రీ నేపథ్య సంగీతం ఆడియన్స్‌ని కట్టిపడేస్తాయి. వీటికితోడు ప్రథమార్థం ప్రతి పాట అద్భుతం. ఓ విధంగా ఇది దేవిశ్రీ ప్రసాద్ విశ్వరూపం. నిజానికి ఈ కథ జనాలకు తెలుసు. తెలిసిన కథను కొత్తగా తీర్చిదిద్దటం నిజంగా కత్తి మీద సామే. అయితే చందు మొండేటి అలాంటి రిస్కు తీసుకోలేదు. ఉన్న ఎమోషన్స్ చూపించడానికి తాపత్రయపడ్డాడే తప్ప, సన్నివేశాల కల్పనలో కొత్త దారులు వెతకలేకపోయారు. అందుకే సినిమా కాస్త స్లోగా నడిచింది. సెకండాఫ్‌లో రాసుకున్న దేశభక్తి సన్నివేశాలు కూడా అంత ఉత్తేజపూరితంగా లేవు. రాజు బృందాన్ని విడిపించడానికి సాయిపల్లవి చేసే ప్రయత్నాలు కూడా మనసులకు హత్తుకునేలా అనిపించవ్. అయితే.. తన జట్టులోని ఒకడ్ని కాపాడుకోడానికి పాకిస్తాన్ బోర్డర్‌లోకి రాజు దూసుకెళ్లే సినిమా మాత్రం హై ఇస్తుంది. మొత్తంగా ఫస్టాఫ్ సందడిగా.. సెకండాఫ్ కాస్త నిదానంగా సాగింది.. ఎవరెవరు ఎలా చేశారు.? తండేల్‌రాజుగా నాగచైతన్య అద్భుతంగా చేశాడు. ఆయన మేకోవరైన విధానం.. క్యారెక్టర్‌లోకి పరకాయ ప్రవేశం చేసిన తీరు వండర్. ఇందులో ఓ కొత్త నాగచైతన్యను చూడొచ్చు. ఇక సాయిపల్లవి.. ఆమె స్క్రీన్ ప్రెజన్స్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. సత్య పాత్రకు ప్రాణం పోసింది. మిగతా పాత్రధారులు కూడా పరిధిమేర రక్తికట్టించారు. ఇక దేవిశ్రీ సంగీతం ఈ సినిమాకు ప్రధాన బలం. ప్రతి పాట హిట్టే. దానికి తోడు అద్భుతమైన ఆర్ఆర్. విజువల్స్ కూడా బావున్నాయి. గీతా ఆర్ట్స్ సినిమాల క్వాలిటీ, భారీ తనం ప్రస్ఫుటం కనిపించింది. ముఖ్యంగా సముద్రంలో తుఫాన్ సీన్ల విజువల్స్ సూపర్. కెమెరా పనితనం చాలా బావుంది. సాంకేతికంగా అన్ని విధాలుగా సినిమా బాగుంది. దర్శకుడు చందూ మొండేటి స్క్రిప్ట్ విషయంలో కాస్త జాగ్రత్తగా ఉంటే ఇంకా బావుంది. ఇలాంటి కథలో ఎమోషన్సే ముఖ్యం. ఆ విషయంలో కాస్త తడబడ్డాడనే అనిపించింది. చివరిగా చెప్పొచ్చేదేంటంటే.. చిన్న చిన్న లోపాలే తప్ప సినిమా మాత్రం మంచి సినిమా.

# అరెస్ట్ వారెంట్‌పై స్పందించిన సోనూసూద్



ప్రముఖ నటుడు సోనుసూద్‌కు అరెస్ట్ వారెంట్ జారీ అయిన విషయం తెలిసిందే. మోసం కేసులో వాంగ్మూలం ఇవ్వడానికి రాకపోవడంతో పంజాబ్‌లోని లుథియానా కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ వార్త సోషల్ మీడియాలో తెగ షేర్ కావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. తాజాగా దీనిపై పోస్ట్ పెట్టారు. "సోషల్ మీడియా వేదికగా హల్‌చల్ చేస్తున్న వార్తపై సంచలనాత్మకమైన విషయాలను స్పష్టంచేయాలి. విషయం సూటిగా చెప్పాలంటే నాకు ఎటువంటి సంబంధం లేని అంశం విషయంలో కోర్టు నన్ను సాక్షిగా పిలిచింది. మా న్యాయవాదులు కోర్టుకు సమాధానమిచ్చారు. ఫిబ్రవరి 10న దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తాను. నా ప్రమేయం లేని విషయాలను మీ అందరికీ స్పష్టంగా వివరిస్తాను. ఆ కేసుకు, నాకు ఏవిధమైన సంబంధం లేదు. దీనిపై మీడియా అనవసరంగా దృష్టి సారిస్తుంది. సెలబ్రిటీలను టార్గెట్ చేయడం బాధాకరం" అని రాసుకొచ్చారు. ఇక లుథియానాకు చెందిన న్యాయవాది రాజేశ్ ఖన్నా తనకు మోహిత్ శర్మ అనే వ్యక్తి రూ.10 లక్షలు మోసం చేశాడని కోర్టులో కేసు వేశారు. రిజికా కాయిన్ పేరుతో తనతో పెట్టుబడి పెట్టించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో సదరు న్యాయవాది సోనూసూద్‌ను సాక్షిగా పేర్కొన్నారు. దీంతో విచారణ చేపట్టిన కోర్టు సోనూసూద్‌కు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. "సోనుసూద్‌కు పలుమార్లు సమన్లు పంపించినప్పటికీ అతను హాజరుకాలేదు. వెంటనే అతడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టాలి" అని ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కేసు ఈ నెల 10న మరోసారి విచారణకు రానుంది.

# అందాల మాళవిక శర్మ

మాళవిక శర్మ అంటే తెలియని సినీ అభిమాని ఉండరు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ, తన గ్లామర్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది ఈ అమ్మడు. మాళవిక శర్మ 1999 జనవరి 26న ముంబైలో జన్మించింది. ఆమె న్యాయవాది కూడా. ఆమె రిజ్వీ లా కాలేజీ నుండి క్రిమినాలజీలో స్పెషలైజేషన్‌తో బ్యాచిలర్ ఆఫ్ లాస్ డిగ్రీని పొందింది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన మాళవిక శర్మ, ఆ తర్వాత సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. మాళవిక శర్మ ప్రధానంగా తెలుగు, తమిళ సినిమాల్లో నటించింది. ఆమె 2018 లో రవితేజతో కలిసి "నేల టిక్కెట్" చిత్రంలో నటించడం ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ఆమె "రెడ్" ,"కాఫీ విత్ కాదల్" ,'హరోం హర , భీమా వంటి చిత్రాలలో నటించింది.అయితే ఈ సినిమాలు బాక్సాఫీస్ పెద్దగా విజయాన్ని నమోదు చేయలేకపోయాయి. దీంతో మాళవిక శర్మ కెరీర్ అనుకున్నంతస్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. మాళవిక శర్మ చేతిలో పెద్దగా సినిమాలు లేకపోయినప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం చురుకుగా ఉంటుంది.మాళవిక శర్మ ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా తన అభిమానులతో టచ్‌లో ఉంటుంది. ఇదే సమయంలో తన వ్యక్తిగత విషయాలతో పాటు, తన సినిమా విషయాలను సైతం అభిమానులతో సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంది. తన లేటెస్ట్ ఫొటోలను సైతం అభిమానులకు షేర్ చేస్తుంటుంది. తాజాగా మాళవిక శర్మ తన లేటెస్ట్ ఫొటోషూట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసింది.మరోసారి తనదైన హాట్‌నెస్ అభిమానులకు కిక్ ఇచ్చింది. బ్లూ కలర్ ఔట్ ఫిట్‌లో కనిపించి అదరగొట్టింది. లోపల్ బ్రా లేకుండా షట్ ఓపెన్ చేసి మరి తన అందాలను చూపించింది. ఈ ఫొటోలపై నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. పరఫెక్ట్ ఫిగర్ అని కొందరు కామెంట్స్ చేస్తుంటే, అన్ని మాకే చూపిస్తే రేపు పెళ్లి అయిన తర్వాత నీ భర్తకు ఏం చూపిస్తావు అంటూ మరి కొందరు కామెంట్స్ చేస్తున్నారు.



# సమంత చాలా దురదుష్టవంతురాలు : శోభిత



యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం గీత ఆర్ట్స్ బ్యానరులో అల్లు అరవింద్ భారీ బడ్జెట్ తో నిర్మించిన తండేల్ సినిమా థియేటర్లలో విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. తాజాగా ఈ సినిమా గురించి అక్కినేని కొత్త కోడలు శోభిత ధూళిపాళ సామాజిక మాధ్యమం లో పోస్ట్ పెట్టింది. ఈ సినిమా కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, థియేటర్లలో ఈ సినిమా కచ్చితంగా చూస్తానని చెప్పింది. నాగచైతన్య-సాయిపల్లవి ప్రేమకథను వెండితెరపై చూసి ఆస్వాదిస్తానని ఆ పోస్ట్ లో పేర్కొంది. ఈ సినిమా షూటింగ్ జరిగినన్ని రోజులు నాగచైతన్య తండేల్ పైనే దృష్టి పెట్టారని, ఇప్పటివరకు తాను నాగచైతన్యను గడ్డంతో చూసి విసుగెత్తిందని, ఇకనైనా గడ్డం తీయి సామీ.. నీ ముఖం దర్శనం చేసుకుంటాను అంటూ రాసుకొచ్చింది. తేండల్ చిత్రంలోని అసాధారణమైన ప్రేమ కథను అందరూ చూసేవారు తాను ఎదురుచూడని, విడుదల రోజే చూసేస్తానని చెప్పింది. అయితే ఒకనొక సందర్భంలో సమంత చాలా దురదృష్టవంతురాలు అని శోభిత చేసిన వ్యాఖ్యలు వైరలవుతున్నాయి. వివాహమై రెండు నెలలవుతోంది. కొత్త కోడలుగా అక్కినేని కుటంబంలో మంచిపేరు తెచ్చుకుంది. వివాహమైన తర్వాత ఇటీవలే తొలిసారిగా ఈ జంట బయట దర్శనమిచ్చింది. నాగచైతన్య-శోభిత చాలా సంతోషంగా ఉన్నారని దీన్నిబట్టి అర్థమవుతోందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అక్కినేని లాంటి పెద్ద కుటుబంలోకి కోడలిగా అవకాశం వస్తే సమంత చాలా దురదృష్టవంతురాలై దాన్ని పోగొట్టుకుందంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఏదేశమైనప్పటికీ శోభిత ధూళిపాళ చాలా అదృష్టవంతురాలంటున్నారు. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అల్లు అర్జున్ హాజరు కావాల్సి ఉన్నప్పటికీ అభిమానులు భారీ స్థాయిలో వస్తే తొక్కిసలాట జరుగుతుందనే ఉద్దేశంతో ఆయన రాలేదంటున్నారు.

# నేషనల్ క్రష్ ట్యాగ్‌పై రష్మిక ఆసక్తికర వ్యాఖ్యలు

నేషనల్ క్రష్ ట్యాగ్‌ని ఉద్దేశించి తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు నటి రష్మిక. వయసుతో సంబంధం లేకుండా తాను ఇప్పుడు అందరి ప్రేమాభిమనాలు సొంతం చేసుకుంటున్నానని అన్నారు. సినీ ప్రియుల ప్రేమను అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. "2016లో నటించిన తొలి చిత్రం 'కిరిక్ పార్టీ' విడుదలైనప్పటి నుంచి నేషనల్ క్రష్ అనే టైటిల్ మొదలైంది. అంతకంటే ముందు, చదుకునే రోజుల్లో కాలేజీ మొత్తానికి నేనే క్రష్‌ని. ఆ తర్వాత కర్ణాటక క్రష్.. సినిమాల్లోకి వచ్చాక నేషనల్ క్రష్ అయ్యా. యువతతోపాటు ప్రేక్షకులందరూ నన్ను అమితంగా ఇష్టపడటం చూస్తుంటే 'నేషనల్ క్రష్' అనే దశ నుంచి ముందుకు వచ్చినట్లు ఉంది. ఇప్పుడెవరైనా ప్రేక్షకులు నన్ను కలిసి.. "ప్రతి ఒక్కరి హృదయాల్లో మీరే ఉన్నారు" అని చెబుతుంటే నాకెంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది. ఇప్పుడు ప్రేక్షకుల జీవితాల్లో భాగమైపోయాననిపిస్తుంది" అని రష్మిక ఆనందం వ్యక్తం చేశారు. రష్మిక ప్రస్తుతం 'ఛావా' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్, ఆయన సతీమణి యేసుబాయి పాత్రలో రష్మిక నటించారు. ఫిబ్రవరి 14న ఇది విడుదల కానుంది. ఈ సినిమాలో యాక్ట్ చేయడం గురించి రష్మిక మాట్లాడారు.



# చాలా సంతోషంగా ఉంది
## - లావణ్య త్రిపాఠి

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ లావణ్య త్రిపాఠి 'అందాల రాక్షసి' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయం అయింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. ఈ క్రమంలోనే మెగా హీరో వరుణ్ తేజ్‌ను ప్రేమించింది. ఇక వీరిద్దరు కొద్ది కాలంపాటు సీక్రెట్‌గా లవ్ చేసుకుని పెద్దలను ఒప్పించి 2023లో ఇటలీలో డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకున్నారు. అయితే పెళ్లి జరిగినప్పటి నుంచి వరుణ్ తేజ్ వరుస చిత్రాలు చేస్తూ ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. కానీ లావణ్య మాత్రం సినిమాలకు దూరం అయింది. ఇంట్లోనే ఉంటూ కుటుంబ బాధ్యతలు తీసుకుంది. ఇక పెళ్లి తర్వాత ఈ అమ్మడు 'మిస్ ఫర్‌ఫెక్ట్' వెబ్ సిరీస్ చేసింది. కానీ ఎలాంటి కొత్త సినిమాను ప్రకటించలేదు. ఈ నేపథ్యంలోనే మెగా ఫ్యామిలీ ఆమెకు కండీషన్స్ పెట్టినట్లు పలు వార్తలు వైరల్ అయిన విషయం తెలిసిందే. కానీ వరుణ్ మాత్రం అవన్నీ పుకార్లేనని కొట్టి పారేసి తన కోసం కొత్త కథలు వెతికే పనిలో పడినట్లు వెల్లడించారు. ఇక ఇటీవల ఆమె 'సతీ లీలావతి' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా షేర్ చేశారు. అంతేకాకుండా ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా పూర్తి అయ్యాయి. కానీ షూటింగ్ గురించి మాత్రం లావణ్య వెల్లడించలేదు. దీంతో అంతా ఆమె అసలు సినిమాల్లోకి రీఎంట్రీ ఇస్తుందా లేదా టైటిల్ పోస్టర్‌తోను సరిపెడుతుందా అనే అనుమానంలో ఉన్నారు. ఈ క్రమంలో.. తాజాగా, లావణ్య త్రిపాఠి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా శుభవార్త ప్రకటించింది. 'సతీ లీలావతి' షూటింగ్ స్టార్ట్ అయినట్లు వెల్లడించింది. "సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది" అనే క్యాప్షన్ జత చేసింది. షూటింగ్ సెట్ నుంచి ఫొటోను కూడా షేర్ చేసింది. అది చూసిన మెగా అభిమానులు ఖుషీ అవుతున్నారు.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463